గాంధీ జోషి లేఖలు

బెజవాడ, 1945

Record no. 103

Gāndhī Jōṣi Lēkhalu

Bejavāḍa, 1945

Record no. 103

Bibliographic Record Target

గాంధీ జోషి లేఖలు / పి. సి. జోషీ. - బెజవాడ: ప్రజాశక్తి కార్యాలయం, 1945.
vii, 47, (1) p. ;16 cm.
Record no. 103

Gāndhī Jōṣi Lēkhalu / Pi. Si. Jōṣī. - Bejavāḍa: Prajāśakti Kāryālayaṃ, 1945.
vii, 47, (1) p. ;16 cm.
Record no. 103

ప్రచురణ నెం. 117

గాంధీ జోషి లేఖలు

ముందుమాట

గాంధీజీకీ నాకూ జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలను ప్రచురించాలనే ఉద్దేశం నాకు మొదట్లో లేదు. కాని, ఈ ఉత్తరప్రత్త్యుత్తరాలు జరిగాయన్న విషయాన్ని అవకాశంగా తీసుకొని, కొంతమంది దుష్ప్రచారం సాగించారు. కమ్యూనిస్టువ్యతిరేక అమ్ములపొదిలో దీనినికూడా చేర్చారు.

'ఇండియన్ వీక్లీ న్యూస్ మేగజైన్' (భారత వారపత్రిక) అని పెద్ద బిరుదు పెట్టుకున్నా, నిజానికి కాంగ్రెసు సోషలిస్టుపార్టీకి తలలో నాలుకఆయిన 'ఘోరం' పత్రిక 1945 ఏప్రిల్ 15 వ తేదీ సంచికలో 'న్యూస్' క్రానికల్' శీర్షికక్రింద ఇలా రాసింది :

పి. సి. జోషి తోకముడుచుట

"కుశాగ్రబుద్ధీ, 'భారతదేవి' పత్రికకు సహాయ సంపాదకుల్లూ, టాటన్‌హామ్ - జోషీముఠాకు జవాబుచెప్పినవారూ, అయిన కె. అరుణాచలంగారు దిగ్భ్రమ కలిగించే మరో విషయం బయటపెట్టారు. ఈ మధ్య అరుణాచలం సేవా గ్రామం వెళ్లారు. అక్కడ మహాత్ముని కలుసుకున్నారు. అక్కడ అరుణాచలం పి. సి. జోషీని గురించి ఒక యదార్ధగాధను తెలుసుకున్నారు. స్టాలిన్ మంత్రాలను జపిస్తూవుండే ఈ అర్భకుడిని, కమ్యూనిస్టుల రాజకీయాలనుగురించి మహాత్ముడు నాలుగు ప్రశ్నలడిగారట. ఖచ్చితమైన సమాధానాలను వెంటనే పంపమని కోరారట. కాని జరిగిందేమిటి? చాపుకయినా వెరువమని బాకాలూదే పూర్ణచంద్ర జోషి, ఎన్నో వ్యవహారాలలో కథానాయకుడు, సమకాలిక విషయాలపై ఎన్నోపుస్తకాలు రాయించినవాడు, నోరుమెదపక కూర్చున్నాడు. మళ్ళీ మొహం చూపలేదు. ఇలా జరిగినందుకు సేవాగ్రామం అంతా కడుపుబ్బ నవ్వుతున్నారుట. ఇక నీకమ్యూనిస్టు కుర్రవాళ్ళకి "ఇంటర్‌వ్యూలు" ఇవ్వకూడదని కూడా అక్కడివారు నిర్ణయించుకున్నట్లు తెలుస్తూంది. ఎందువల్లనంటే, వీరు తమచేతికి దొరికినదానినంతా తమ కనుకూలమయిన స్వరూపంలోకి మార్చడానికే ప్రయత్నిస్తారట."

కమ్యూనిస్టులంటే ఎలాంటి అపోహలున్నవారైనా సరే, ఈ జాబులను చదువగానే గ్రహించగలరు. 'ఘోరమ్', దాని విలేఖరులు, వార్తా ప్రచురణ అంటూ ఎలాంటి పచ్చి అబద్దాలను ప్రచురిస్తున్నారో.

ఆంధ్రరాష్ట్రంలోని కమ్యూనిస్టు వ్యతిరేకులుకూడా ఇలాంటి కథనే ప్రచారంచేస్తున్నారు. "పి. సి. జోషి నాతోకొద్దిసేపు మాట్లాడాడు. అప్పుడు నేను అతనికి కొన్నిప్రశ్నలు వ్రాసియిచ్చి, వాటికి సమాధానాలతో తిరిగి రండి, నేటిరాజకీయ విషయాలనుగురించి చర్చిద్దామని చెప్పాను. ఆయన తిరిగి రానూలేదు, పోస్టులోనైనా సమాధానాలను పంపనూలేద"ని గాంధిజీ తమతో అన్నట్లు సేవాగ్రాం వెళ్ళివచ్చిన "ఆంధ్రరాష్ట్రవిద్యార్థి, యువజన కాంగ్రెసు" ప్రతినిధులు 'ఆంధ్రపత్రిక' విలేఖరితో చెప్పేరట.

ఇలాంటి ఆబద్ధాలను కమ్యూనిస్టు వ్యతిరేకులే కల్పించారనీ, గాంధిజీ ఎన్నడూ చెప్పివుండరని పాఠకులే గ్రహించగలరు.

"ఆంధ్రప్రభ" మరొక తెలుగు దినపత్రిక. అదికూడా ఇలాంటి వార్తనే ప్రచురించింది. పై ప్రతినిధుల్లో కే. యల్. సుందర్రావుని ఇది పేర్కొంది. "కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పమని జోషీని గాంధిజీ అడిగారు, మళ్ళీ జోషి ముఖమైనా చూపలేద"ని గాంధిజీ కార్యదర్శియైన శ్రీయుత ప్యారీలాల్‌గారు ఈ సుందర్రావుతో చెప్పారట.

ఈ ప్రతినిధులు యువకులు. తమ రాజకీయ ప్రతి కక్షులనుగురించి పచ్చి ఆబద్ధాలాడడమే ఇప్పుడు వీరికి నేర్పుతూన్న పాఠాలయితే — ఇక వీరు పెరిగి పెద్దయినతరువాత ఎంతకు పూనుకోరు?

ఇంతకన్నా కొంచం బాధ్యతనెరిగిన మరికొన్ని పత్రికలు, మాకు ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయన్న సంగతిని తెలుసుకొని, వాటి సారాంశాన్ని స్వంతంగా కల్పించాయి.

"హిందూస్థాన్" అనే హిందీ దినపత్రిక వీటిలో ఒకటి. "కాంగ్రెసులోనుంచి మమ్మల్ని వెళ్ళగొట్టకండి : గాంధీజీకి కమ్యూనిస్టు నాయకుని విజ్ఞప్తి" అనే శీర్షికపెట్టి, డిసెంబరు 5 వ తేదీని లక్నోనుంచి వచ్చిన వార్తను ఇలా ప్రచురించింది :

"భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి అయిన శ్రీ పూర్ణచంద్ర జోషిగారు గాంధీజీకి ఒక జాబురాశారనీ, కమ్యూనిస్టులను కాంగ్రెసునుంచి వెళ్ళగొట్టుటను అందులో ఖండించారనీ తెలుస్తూంది.

"ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను త్వరలో ప్రచురిస్తారు. తమను కాంగ్రెసులోనుంచి వెళ్ళగొట్టడం తప్పని గాంధీజీ ప్రకటించాలని కమ్యూనిస్టుల కోరిక."

"విశ్వమిత్ర" అనేది మరొక హిందీ దినపత్రిక. డిసెంబరు మొదటితేదీ సంచికలో ఇలాంటివార్తనే ప్రకటించింది :

"కాంగ్రెసులోనుంచి కమ్యూనిస్టులను వెళ్ళగొట్టడం గురించి భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ పూర్ణచంద్ర జోషీగారికి, మహాత్మునికి ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతున్నట్లు తెలుస్తూంది. త్వరలోనే ఈ జాబులను ప్రకటిస్తారు. తమను కాంగ్రెసులోనుంచి వెలివేయడం సబబుకాదని దేశంలోప్రచారం చేసుకోడానిగ్గాను గాంధిజీ కొన్ని మాటలు చెప్పవలసిందని కమ్యూనిస్టులు కోరినట్లు అనుకుంటున్నారు."

మన పత్రికల్లో కొన్నిటియొక్క 'జో హుకుం' తత్వాన్ని పై ఉదాహరణలు తేటతెల్లం చేస్తున్నాయి. గాంధీజీ దయాదాక్షిణ్యాలను భిక్షమడగడానికితప్ప, మరోవిషయంమీద ఎవ్వరూ వారితోఉత్తర ప్రత్యుత్తరాలు జరపజాలరనే వీటి నమ్మకం. ఇతర విషయాలనుగురించికూడా గాంధీజీకి జాబులు రాయగలవారు ఉంటారన్నది వీటి ఊహకూ్కడా అందని విషయం. స్వతంత్రమైన పోకడకలిగి, స్వశక్తిపైనే ఆధారపడగలిగి ఉంటూ, ఇతరులందరితోనూ సౌభ్రాతృత్వాన్ని కుదుర్చుకోడానికి పాటుపడే ఒక రాజకీయ పక్షం ఉండగలదనే విషయం వీటి మెదడుకు మించిన సంగతి.

ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను గురించి, ఇదే ధోరణిలో రాసిన పత్రికలు నాయెదుట ఒకకుప్పవున్నాయి. ఇప్పుడు ప్రచురిస్తున్న ఈ జాబులే అబద్ధాలకోరుల స్థానమేదో తేల్చగలవు; ఊహాకల్పితాలను [illegible]కట్టగలవు. కమ్యూనిస్టుల నిజభావాలను గ్రహించగల అవకాశాని చిత్తశుద్ధిగల వారందరికే కలిగించగలవు.

ఈ జాబుల గురించి నేనేమీ వ్యాఖ్యానించ దలచుకోలేదు. వేరే వ్యాఖ్యానం అనవసరంకూడాను.

కాంగ్రెసు సోషలిస్టులు మాపైని అవాకులు చెవాకుల నెన్నిటినో దేశంలో ప్రచారం చేశారు. వీటిలో ఏ ఒక్కదాన్నికూడా రుజువు చేసుకోవాలనే బాధ్యత వీరికి అక్కర లేకుండా పోయింది. కాని, వీటినే, గాంధీజీకి చెవినిల్లు కట్టుకొని, నూరిపోశారు. ఈవిషయం గాంధిజీని కలుసుకొన్న మరుక్షణంలోనే నాకు స్పష్టమయింది. అంతే కాదు, తమకందివచ్చిన ప్రతి కాంగ్రెసువాదినేత, మాపై ఆరోపణల చేస్తూ గాంధిజీకి రాయించడానికి దేశమంతటా ఉద్యమం నడిపారు.

మా రాజకీయ విధానాన్ని గురించి, రాజకీయంగా మా నీతి నియమాలను గురించి, గాంధిజీ తన మొదటి జాబులో కొన్ని ప్రశ్నలు వేశారు. క్లుప్తంగా వాటికన్నిటికి సమాధానమిచ్చాను. కాని, మారాజకీయ నీతినియమాలను గురించిన ఆరోపణలు రుజువవడమో, లేక ఆధారరహితాలని కొట్టివేయడమో - ఏదోఒకటి తేలేవరకు, రాజకీయ విధానంపై చర్చ నడపకూడదనుకొని అట్టి పెట్టాను.

ఇది ప్రజాయుద్ధమనే విషయంపై గాంధీజీ మాతో ఏకీభవించలేదు.

డబ్బువిషయాన్ని గురించి నేనిచ్చిన సమాధానం "పూర్తిగా సంతృప్తికరంగా ఉంద" ని గాంధీజీ ఒప్పుకున్నారు.

ఇతర అంశాలను గురించి గాంధీజీ ఇలా రాశారు : "మీ జవాబులు నా కర్థమయాయి. వాటి ప్రాశస్త్యాన్ని గ్రహించాను. అయితే, మీ పార్టీని గురించి నాలోకొన్ని దురభిప్రాయాలున్నాయి. అవి లేకపోయినట్లయితే, మీ జవాబులను అంగీకరించడంలో నాకెట్టి సంశయం ఉండేదికాదు. నా చిక్కులు నిజమైనవి. సానుభూతితో మీరు వాటిని ఆలోచించాలి" మనందరిలోకి గాంధీజీ ఉత్తమోత్తముడు. దురభిప్రాయా లుండడం వల్లనే నా సమాధానాలను అంగీకరించలేకుంటున్నానని అలాంటివారే అన్నప్పుడు ఇకనేను చెప్పవలసిందేమీలేదు.

తన [illegible]డవపటిజాబులో గాంధిజీ, "మిమ్మల్ని ఆక్షేపించజాలను" అని రాస్తూ, నాతో [illegible] తాను స్వయంగా ఎరిగున్న మరికొంతమంది కమ్యూనిస్టుల్నికూడా పే[illegible]రు. మాకిప్పుడొచ్చిన పెద్ద చిక్కేమి [illegible]

టంటే, ప్రతికమ్యూనిస్టుకూడా తనకాంగ్రెసు మిత్రునినోటినుండి ఇవే మాటలను వింటున్నాడు. ప్రతి కాంగ్రెసువాదీ తన ఎదుటనున్న కమ్యూనిస్టుని పొగుడుతాడు; అంతకుమించి విస్పష్టంగా ఏమీ చెప్పడు. ఆ తరువాత గుడ్డి అపోహల బలంవల్లా, పునరుచ్చారణ దోషంవల్లా, బాగా అల్లుకుపోయిన అసత్య ఆరోపణలనే తానుకూడా వల్లిస్తాడు.

నా హృదయంలో ఉన్నదంతా గాంధీజీ ఎదుట విప్పి పెట్టాను. మమ్మల్నిగురించి చాలా తీవ్రమయిన ఆరోపణలు వారికి చేరాయి. వాటిని గురించి ఒక నిర్ణయానికి రావడానికి వారికి రెండు పద్ధతులు సూచించాను.

మొదటిది — ఈ ఆరోపణలుచేసిన ఫిర్యాదీలు, ఎక్కడయినా సరే — వారినీ, మమ్మల్నీ బాగా ఎరిగున్న ప్రజాసామాన్యం ఎదుట నిలబడి ఆరోపణలను వెల్లడిచేయమనండి. ఆ ప్రజల తీర్పుకే వాటిని విడిచిపెట్టమనండి.

రెండవది — అప్పటికి బయట ఉన్న వర్కింగుకమిటీ సభ్యులు, తన సహచరులు, అయిన రాజాజీ, సరోజినీదేవి, భూలాభాయిదేశాయీలకు గాంధీజీ తనవద్దనున్న కమ్యూనిస్టువ్యతిరేక పత్రాలనుచూపి, వారి అభిప్రాయాలను తీసుకొమ్మని కోరాము. చేసిన తప్పేమీ లేనప్పుడు ఇలా విచారణకు నిలబడతానని ముందుకు రావడంవల్ల నన్ను నేనే అగౌరవపరచుకుంటున్నానని రాజాజీ నాతో అన్నారు. తనకన్నా వయసులో ఎంతో చిన్నవాడి నయినప్పటికీ, ఈ విషయంలో అనవసరమయిన స్వాభిమానం ప్రదర్శించ నక్కరలేదనుకుంటున్నాను,— అందువల్లనే పూజ్యులైన జాతీయోద్యమ నాయకులయెదుట విచారణకు నిలబడడం ఒక గౌరవంగా భావిస్తున్నాననీ వారికి నేను జవాబుచెప్పాను.

సరోజనీదేవి ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను చూచి, మా పైని చేసిన ఆరోపణలను పట్టి తెలివితక్కువ మాటలక్రింద లెక్కకట్టారు. ఈ అభిప్రాయాన్నే బహిరంగంగా ప్రకటించారు కూడా. ఒక సారి భూలాభాయి దేశాయిగారిని కలుసుకున్నప్పుడు, గాంధీగారి వద్దనున్న కమ్యూనిస్టు వ్యతిరేక పత్రాలపైలు ఎక్కడో పోయిందనీ, వాటికోసం వెతుకు తున్నామని, సేవాగ్రాంనుంచి తనకు వార్త వచ్చినట్లు నాతో చెప్పా... మరికొన్ని మాసాల తరువాత వారిని మరల కలుసుకోవడం ...స్థంచింది. అప్పటికి ఈపత్రాలను వీరంతాచూచి ఇంకాకొన్నిపత్రాలు రావాలిసివుందని అన్నా...

అంతిమ విచారణకే పిలిస్తే హాజరు కావడం కోసం పదకొండు మాసాల పాటు ఓపికపట్టాను. కాని లాభం లేకపోయింది. ఆ పిలుపు రాలేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి నేను గాంధిగారికి సూచించిన ఈ రెండు మార్గాలు తప్ప మరొకమార్గం నాకు తట్టలేదు. మమ్మల్నిగురించి దాచుకోవలసిన విషయాలు మాపార్టీకేవీ లేవన్న సంగతిని చదువరులే గ్రహించగలరు. నిజం చెప్పవలసివస్తే మా పక్షానికే అపచారం జరిగింది.

ఈ జాబులను ప్రచరించడంలో మా ఉద్దేశం చెపుతాను. వీటిని గురించి జరిగిన దృష్ప్రచారానికి జవాబుచెప్పడం కోసమేకాదు ఈ ప్రచురణ. మనదేశంలో రాజకీయ జీవితం ఎంత నీచస్థితికి పతనమైపోయిందో నిసలైన దేశభక్తులకు తేటతెల్లం చేయాలన్న ఉద్దేశంతోకూడా వీటిని ప్రచురిస్తున్నాం.

జాతీయ నాయకులయెదుట తీవ్రమైన ఆరోపణలు చేశారు. కాని ఫిర్యాదీలు వాటిని రుజువుచేయవలసిన బాధ్యతను వహించడంలేదు.

విచ్ఛిన్నకర పోకడలు, బాధ్యతా రాహిత్యం ఒకదానికొకటి తోడునీడలు. కాని అవి ఏనాడయినా ఇంత శృతిమించి పోయాయా?

తోకకూ బెణుకూ లేకుండా నీచాతినీచమైన ఆరోపణలను చేశారు. వినీ వినడంతోడనే అవెంత బేసబబయినవో స్పష్టంకాక తప్పదు.

మనజాతీయోద్యమంలో ఇలాంటివి జరుగుతున్నాయి. ఆ మహోద్యమం ఏస్థితికి వచ్చేసింది? ఇక దీని పర్యవసానం ఏమికాగలదు??

వెనుక, ఒకసారి ఇలాంటి ఆరోపణలే దేశమంతటా జరిగాయి. అది 1920-21రోజుల్లో. ప్రభుత్వగులాములు కొందరు 'లాయలిస్టు'సభలను పెట్టి కాంగ్రెసుని ఇలాంటి తుచ్ఛమైన ఆరోపణలకు గురిచేశారు. ...

గుర్తున్న వృద్ధ కాంగ్రెసువాదులు ఈ విషయంయొక్క ప్రాధాన్యతను గుర్తించాలి. అప్పుడు నేనొక పసికుర్రవాడిని. అయినా, నెహ్రూ కుటుంబాన్ని గురించి, గాంధీజీనిగురించి ప్రచారమయిన నీలాపనిందలను విన్నప్పుడు నావళ్లుమండేది; 'తిలక్ స్వరాజ్యనిధి 'ని గురించిన విషప్రచారాన్ని వింటుంటే నారక్తం ఉడికిపోయేది.

మాపార్టీ వయసులో చిన్నది. మాపైని సాగుతూన్న దుష్ప్రచారానికి మేము రెచ్చిపోతే – అది సహజమే అనిపించుకునేది. కాని. వయసులో మాపార్టీకన్న మన జాతీయోద్యమం రెండింతలు పెద్దది. ప్రాచీన ఔన్నత్యంతో ప్రకాశిస్తున్న మనజాతికి సహనం సహజలక్షణం. ఆ సహనంలో మన జాతీయోద్యమం అమోఘమైన ఆదర్శాలను స్థాపించింది. ఆ ఆదర్శాన్నే మేముకూడా అనుసరిస్తున్నాము.

ప్రజలమధ్య నిలబడి, రాజకీయంగానే మమ్మల్నెదిరించడానికి మా రాజకీయ ప్రతికక్షులకు సాధ్యం కాకపోతే; పచ్చి అబద్ధాలను, కారుకూతలనే సాధనాలుగా వారు ఉపయోగించ దలుచుకుంటే, ఇక ఘోరపతనానికి, అధోగతికి, పాలయేది వారేగాని మరెవ్వరూకాదు. ఇది మా దృఢాభిప్రాయం.

కాంగ్రెసు – కమ్యూనిస్టు సంబంధాన్నిగురించి సగౌరవంగా చర్చలు జరిగేలా చేయడానికి, ఈ జాబులను చదివిన ప్రతివారూ శక్తి కొలది తోడ్పడతారని మేము హృదయ పూర్వకంగా ఆశిస్తున్నాము. కారుకూతలు కూసే వారెప్పుడూ బహుకొద్దిమందే వుంటారు. కాని, మిగతావారంతా వీరి కూతల్ని సహించినట్లయితే రాజకీయ వాతావరణమంతా కళంకితమయిపోతుంది.

1–7–45 పి. సి. జోషీ.

సవరణ

21వ పేజీ 'రెండవప్రశ్న' శీర్షికకింద రెండవపేరా నాలుగవ పంక్తిలో 'మీ జవాబులు నా కర్థమయాయి' అన్న తరువాత, 'వాటి ప్రాశస్త్యాన్ని గ్రహించాను' అని చేర్చి చదివాలి.

ఆ పేరాలోనే, 6 వ పంక్తిలో, 'మీ జాబులను అంగీకరించడంలో" అనిఉంధి 'మీ జవాబులను' అని చదవాలి.

గాంధీ - జోషీ లేఖలు

I

మహాత్మా గాంధీకి పి. సి జోషీ వ్రాసిన జాబు.

బొంబాయి : 1944 మే 6

ప్రియమైన గాంధీజీ,

కమ్యూనిస్టుపార్టీ తరపున మీకివే నా అభివందనాలు. మీరు త్వరలో పూర్తి ఆరోగ్యాన్ని కోలుకోగలందులకు తోటిదేశస్థులతోపాటు ఆశిస్తున్నాము. దేశంలోని రాజకీయ ప్రతిష్టంభన ఒకవైపు కరువు పరిస్థితులను, మరోవైపు జపాను దురాక్రమణను తెచ్చిపెట్టింది. ఈ ప్రతిష్టంభన నెదుర్కోవాలనీ, ప్రజలకు ఆహారాన్ని, దేశానికి స్వాతంత్ర్యాన్ని, చేకూర్చడానికి జాతీయపక్షాలన్నీ ఐక్యంకావాలని ప్రజలు ఆతృతతో ఎదురుచూస్తున్నారు. జాతీయ సంస్థలన్నిటిలోను తలమానికమయిన కాంగ్రెసు మహాసంస్థకు ప్రియతమ నాయకులైన మీరిందుకు నాయకత్వం వహించి, ప్రజల్ని ముందుకు నడుపగల సుదినంకోసం వినమ్రులమై ఎదురు చూస్తున్నాం.

ఈనాడు మాపార్టీ అవలంబిస్తున్న విధానాన్ని మీకు వివరించడానికి, మీరులేని సమయంలో దేశాన్ని అధోగతిపాలు కాకుండా కాపాడడానికి, మేముచేసిన స్వల్పసేవను తెలుపుకోడానికి అవకాశంచిక్కితే నేనెంతో ఆనందిస్తాను,

మాపార్టీ తరపున మీకు హృదయపూర్వకమైన జోహారు లర్పించడానికి, మీకిదివరకే పరిచయుడైన కామ్రేడ్ బాట్లివాలాను పంపుతున్నాను.

వినయపూర్వకమైన అభివందనాలు
పి. సి. జోషి

II

పి. సి. జోషీకి మహాత్మా గాంధీ రాసిన జాబు.

జుహూ : 1944 జూన్ 11

ప్రియమైన జోషీ,

మన సంభాషణలో నేను కొన్ని ప్రశ్నలడిగాను. * వాటికి సమాధానాలు మీరు వెంటనే పంపుతారని ఎదురు చూశాను. ఈలోగా మరి కొన్ని సందేహాలు వచ్చాయి. నా మొదటి ప్రశ్నలతోపాటు, వీటికూ్కూడా సమాధానాలు పంపండి.

1. మీరు 'ప్రజాయుద్ధమ'ని అంటున్నారు. దీనిలో 'ప్రజ' అన్న మాటకు మీ నిర్వచనం ఏమిటి? కోటాను కోట్ల భారతీయుల క్షేమంకోసం లేక ఆఫ్రికా, అమెరికాల్లోని నీగ్రోల క్షేమంకోసం - లేక వీరందరి కళ్యాణంకోసం జరుగుతున్న యుద్ధమని దీని భావమా? మిత్రమండలి ఇలాంటి యుద్ధమేనా సాగిస్తున్నారు?

2. మీరు ప్రాతినిధ్యంవహిస్తున్న కమ్యూనిస్టుపార్టీ ఆదాయ వ్యయాలను తనిఖీచేసే అవకాశం ప్రజల్లో ఎవరికయినా ఇస్తారా? అలాంటి అవకాశం ఉంటే నేను వాటిని చూడవచ్చునా?

3. గత రెండు సంవత్సరాల్లోను కార్మికులచేత సమ్మెలు చేయించిన నాయకులను అరెస్టు చేయడంలో కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వానికి చాల తోడ్పడిందని అంటున్నారు - దీని విషయం ఏమిటి?

4. కాంగ్రెసు సంస్థలో జొరబడాలనే విధానాన్ని కమ్యూనిస్టుపార్టీ ఒక దురుద్దేశంతోనే అనుసరిస్తున్నదని అనుకుంటున్నారు.

5. కమ్యూనిస్టుపార్టీ విదేశీయుల చెప్పుచేతుల్లో ఉంటం లేదా?

ఇట్లు,
యం. కె. గాంధీ.

---

* 1944 జూన్ ప్రారంభంలో పి. సి. జోషీ గాంధీగారిని కలసికొని మాట్లాడారు. గాంధీజీ యిచట ఆ సంభాషణ విషయమై ఉదహరించాడు.

III

మహాత్మా గాంధీకి పి. సి. జోషీ రాసిన జాబు.

బొంబాయి : 1944 జూన్ 14

ప్రియమైన గాంధీజీ,

మీ చిన్ని జాబు నాకు సంతోషం, ఆశ్చర్యం కలుగ జేసింది. మమ్మల్ని గురించి అంతా వివరంగా తెలుసుకోవాలని మీకున్న శ్రద్ధను అది వెల్లడిచేస్తూంది.

నేను మీకు వెంటనే జవాబు పంపకపోవడానికి కారణం ఉంది. నేను మిమ్మల్ని కలుసుకున్నందుకే శ్రీమతి సరోజినీనాయుడు గారెంతో ఆందోళనపడ్డారు. అది సకారణమే. పెద్ద రాజకీయ విషయాలను వేటినీ మీరిప్పుడు తీసుకోకూడదని ఆమె అభిప్రాయము. మిమ్మల్ని చూచిన తరువాత నేను కూడా ఈ అభిప్రాయానికే వచ్చాను. మీకు ఆరోగ్యాన్ని త్వరలో కోలుకోవడమే ఈనాడు ప్రధాన కార్యక్రమం. ఇప్పట్లో మీకు ఉత్తరాలు రాయకుండా ఉండడంద్వారా నేనీ కార్యక్రమానికి తోడ్పడగలనని అనుకున్నాను. రెండు వారాలో, ఒక నెలో గడచిన తర్వాత, మీరు మళ్ళీ పనిచేయగల స్థితికి వచ్చారని వైద్యులు ప్రకటించిన తరువాతనే మీకు జవాబివ్వాలని అనుకున్నాను.

నేను మీకొక విషయం చెప్పదలచాను - అది అప్రస్తుతం కాదనుకుంటాను. నేను మిమ్మల్ని కలుసుకోడానికి వచ్చాను. కాని, అప్పట్లోనే మిమ్మల్ని కలుసుకోవాలనే ఉద్దేశం నాకులేదు. మీరు విడుదలై వచ్చినందుకు మా సంతోషాన్ని వెల్లడిస్తూ ఒక జాబురాశాను. దాన్ని స్వీకరిస్తూ, మీరు మాకు ఆహ్వానాన్ని పంపేటంత వరకూ వేచి వుందామని అనుకున్నాం. కాని, మీ రాబెన్‌గారు నేను మిమ్మల్ని కలుసుకోవాలని చాల ఆతురపడ్డారు. మా పైని జరుగుతూన్న దుష్ప్రచారాన్ని చూచి ఆమె చాల ఆందోళన పడింది. ఆమె దిగులునుచూచి నేను నవ్వాను. అయినప్పటికీ ఆమె ఏర్పాటుచేసిన ప్రకారం మిమ్మల్ని కలుసుకున్నాను. ప్రస్తుత పరిస్థితులను గురించి మేమేలాఆలోచిస్తున్నామో మీకు తెలియజేయడానికే వచ్చాను. మన సంభాషణల ఫలితం నాకేమీ సంతోషం కలిగించలేదు - మీరీ విషయం గ్రహించే ఉంటారు.

మీరు తెలిపిన సందేహాలకు క్లుప్తంగా సమాధానాలిస్తున్నాను. ఇప్పట్లో మీకట్టే శ్రమ కలిగించడం తగదు - తరువాత మీరెప్పుడయినా కోరినట్లయితే వివరంగా మీకన్నీ తెలుపుతాను.

మొదటి ప్రశ్న

'ప్రజాయుద్ధ' మనడంలో 'ప్రజ' అన్నమాటకు అర్థమేమిటి? కోటానుకోట్ల భారతీయుల క్షేమంకోసం, లేక ఆఫ్రికా, అమెరికాల్లోని నీగ్రోల క్షేమంకోసం - లేక అందరి కళ్యాణంకోసం జరుగుతూన్న యుద్ధమని దీని భావమా? మిత్రమండలి ఇలాంటియుద్ధమేనా సాగిస్తున్నారు?

మీ మొదటిప్రశ్న నాకు స్పష్టంకావడంలేదు. అయినా సమాధానం ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.

'ప్రజాయుద్ధం' అనడంలో 'ప్రజ' అంటే ప్రపంచ ప్రజలందరూ అని అర్థం - మినహాయింపులు లేవు. కోటానుకోట్ల భారత ప్రజలు, ఎక్కడెక్కడఉన్న నీగ్రోలు కూడా ఇందులో చేరిఉన్నారని వేరే చెప్పనక్కరలేదు.

'మిత్రమండలి' అనేమాటను విశాలమైనభావంతో ఉపయోగిస్తారు. మిత్రమండలిలో వివిధ దృక్పథాలవారున్నారు. మాటకు - మిత్రరాజ్యాల ప్రజలకు వారి ప్రభుత్వాలకు ఎంతోతేడావుంది. ఈ ప్రభుత్వాల్లోనే ఎంతో వ్యత్యాసం వుంది. చర్చిల్ ఆశయాలేమిటో మీరూ ఎరుగుదురు. స్టాలిన్ ఉపన్యాసాలు చదివితే మీకతని ఉద్దేశాలు స్పష్టంకాగలవు. స్టాలిన్ ఉపన్యాసాలను మేమొక చిన్నపుస్తకంగా ప్రచురించాం - ప్యారీలాల్‌గారికి పంపిన పుస్తకాల్లో అదికూడా ఉంది.

ఒక బ్రహ్మాండమైన ప్రపంచ సంగ్రామంపట్ల మన వైఖరిని నిర్ణయించేటప్పుడు, చర్చిల్ దానిని గురించి ఏమనుకుంటున్నాడు; లేక దాని ద్వారా తన ఆశయాలను ఎలా సాధించాలనుకుంటున్నాడు; అన్నవాటిపైన ఆధారపడము. చరిత్రకు చుక్కాని చర్చిల్‌కాదు.

ఈ యుద్ధంలో పాల్గొంటున్నవా రెవరు? వారి వారి గుణదోషాలేమిటి? ఈ యుద్ధంలో తేలే ప్రధానాంశా లేమిటి - వీటినిబట్టే మేము యుద్ధస్వభావాన్ని నిర్ణయిస్తాము.

ఈ యుద్ధం ప్రపంచాన్ని రెండు పక్షాలుగా విడదీసింది.

ఒక పక్షంలో ఫాసిస్టు దురాక్రమణదారులున్నారు. సామ్రాజ్యవాదం తన చరమావస్థలో దాల్చిన అతిదారుణ స్వరూపమే ఫాసిజం. ఫాసిస్టు స్వరూపంలోనే నేడు ప్రపంచసామ్రాజ్యవాదం మనగలదు. ప్రపంచంపై సామ్రాజ్యవాద పెత్తనం స్థాపించడానికే ఫాసిస్టులు పోరాడుతున్నారు.

రెండోపక్షంలో ప్రపంచంలోని స్వాతంత్ర్యాభిలాషులైన ప్రజలందరూ ఉన్నారు. కొన్ని దేశాల్లో అభివృద్ధి నిరోధక, సామ్రాజ్యవాద ప్రభుత్వాలు ఈ ప్రజలపై పరిపాలన సాగిస్తున్నాయి. మరికొంతమంది వలసదేశాల్లో బానిసలుగా పడున్నారు. వీరు స్వతంత్రులు కాకపోయినా జాతీయోద్యమాలను నిర్మించుకోగలిగారు. ఇవి నీగ్రోల ఉద్యమంలాగా కొన్నిచోట్ల బలహీనంగానూ, లేక మన ఉద్యమంలాగా చాల బలీయంగానూ ఉన్నాయి. ఫాసిస్టు జపాన్నెదిరించి ఏడేళ్లుగ హోరాహోరి పోరాడుతూ, ప్రాచ్యదేశాలను జపాను పాదాక్రాంతం కాకుండా కాపాడుతూన్న వీరచైనా ఈ పక్షంలోనేఉంది. సోవియట్ యూనియన్ - నిజమైన స్వాతంత్ర్యం, సంపూర్ణ ప్రజాస్వామ్యాలు వెల్లివిరుస్తూన్న దేశం; వివిధ జాతుల ప్రజలు సోదరభావంతో, ఎక్కడా కనివిని ఎరుగని ఐకమత్యంతో హాయిగా ఉన్నదేశం; చరిత్రలో సాటిలేని రెడార్మీకి పుట్టినిల్లు; ఇంత శక్తిఉందా అని ప్రపంచ ప్రజలు, ప్రభుత్వాలు అచ్చెరువొందేలా చేసిన ప్రజాప్రభుత్వానికి స్థానం - మహోజ్వలమైన సోవియట్‌యూనియన్ కూడా ఈ పక్షంలోనే ఉంది. ప్రపంచాధిపత్యంకోసం హిట్లరు కనిన కలలను భగ్నంచేసి, తూర్పు పడమరలనుండి ఫాసిస్టుమూకలు ముంచుకొచ్చి, మన పవిత్ర భారతభూమిలో చేతులుకలపకుండా చేసిందిసోవియట్ ప్రభుత్వ నాయకత్వంకింద పోరాడిన ఈ రెడార్మీయే. స్వాతంత్ర్యము, ప్రజాస్వామ్యము సార్థకం కావాలంటే ఈ పక్షం ద్వారానే కాగలవు.

తామేపక్షంలో చేరదలచుకున్నారో, ఎవరి విజయాన్ని వాంఛిస్తారో ప్రతిదేశంవారూ ఎంచుకోవలసిఉంది. ప్రతిదేశంయొక్క గతి, యావత్తు ప్రపంచంయొక్క భవిష్యత్తు ఈయుద్ధంలో జయాపజయాలమీద ఆధారపడి ఉంది.

ఫాసిస్టుపక్షమే జయించినట్లయితే ప్రతిదేశానికీ ఫాసిస్టు సామ్రాజ్య వాదంకింద బానిసత్వమేగతి — మానవజాతి స్వాతంత్ర్యానికే స్వస్తి.

మిత్రమండలి విజయం పొందినట్లయితే స్వాతంత్ర్యజ్యోతి నిలిచిం దన్నమాటే. ఈపక్షంలోచేరి పోరాడడంలో ప్రతిదేశం తన స్వాతంత్ర్యం కోసమేకాక, ప్రపంచ స్వాతంత్ర్యంకోసంకూడా పోరాడిన దవుతుంది. బానిసత్వంతో కృంగిపోతున్న ప్రాచ్యదేశాలకిది చిక్కుసమస్యే. బానిస బంధాలు దిగలాగుతూంటే ఏ దేశభక్తిని పురస్కరించుకొని, ఉద్వేగంతో వారు రణరంగంలోకి ఉరుకగలరు? వీరవలంబించాలసిన మార్గం ఏమిటి? నూతన పరిస్థితుల్లో, కొత్తపద్ధతుల్లో వీరు తమ స్వాతంత్ర్యపోరాటం సాగించాలి — అదే వీరికి సులువయిన మార్గం.

ఈ యుద్ధంపట్ల బానిసదేశాల ప్రజలు అవలంబించాలిసిన పద్ధతులను గురించి చర్చించుదాము.

వలసదేశాల జాతీయనాయకులు ఈ యుద్ధాన్ని వ్యతిరేకించారనుకోండి. అప్పుడేమవుతుంది? చేతులార తమదేశానికి ఫాసిస్టు బానిసత్వం తెచ్చిపెట్టినవారవుతారు. ఈ వలసరాజ్యాలనుంచి ఎక్కువబలాన్ని సేకరించుకొని ఫాసిస్టు సామ్రాజ్యవాదులు ఇతర ప్రపంచాన్నంతటినీకూడా స్వాధీనపరచుకోడానికి తోడ్పడినవారవుతారు. తమ చేతితోనే తమ జాతి గొంతుకోసిన వారవుతారు.

లేదు, వలసదేశ నాయకులు తటస్థంగా ఉంటారనుకుందాం. ఈ వైఖరివల్ల తమ ప్రజల చేతులు కట్టివేయడమవుతుంది. నిర్వీర్యము, నిర్జీవము అయిన ఒక పరాయిప్రభుత్వంచేతికి దేశంయొక్క బలసంపదలను అప్పగించి చూస్తూ కూర్చోవడమవుతుంది. అంటే పరోక్షంగా ఫాసిస్టు దురాక్రమణదారులకు తోడ్పడమే అవుతుంది.

అయితే ఇక మనకు గత్యంతరం ఏమిటి? ఇప్పుడు ఫాసిస్టుల నెదుర్కొని, యుద్ధానంతరం మన స్వాతంత్ర్యంకోసం పోరాడడమా? ఇప్పటి బానిసత్వానికి తలొగ్గి, ఈ పరాయి ప్రభుత్వంతో భుజాలు కలపడమా? ఇది దేశభక్తులు అవలంబించవలసిన మార్గంకాదు. తద్వ్యతిరేకమవుతుంది (యం. యన్. రాయ్ పంథావంటిదే ఇది). మన జాతీయోద్యమం మట్టిపాలయి, పరాయిప్రభుత్వం చేతిలో దేశం విచ్ఛిన్నంకావడాని

కిదేమార్గం. ప్రపంచ ప్రజలు ఫాసిజంమీద జరిపే పోరాటంలో ఒకరంగం బలహీనమవడానికి దారితీస్తుందీ వైఖరి.

నేడు యుద్ధరంగంలో నిలచిఉన్న రెండుపక్షాలకుగల తారతమ్యాలను ఎంత స్పష్టంగా గుర్తిస్తామో, ఈ పరిస్థితుల్లో మనజాతి అనుసరించదగిన పంథానుకూడా అంతచక్కగా నిర్ణయించుకోగలుగుతాము. ఈనాడు ప్రపంచంలోని ఇతర అభివృద్ధికరశక్తులతో భుజంభుజం కలిపి ఫాసిస్టు దురాక్రమణదారులను ఎదుర్కోవడమే మనదేశానికి సామ్రాజ్యవాదుల బారినుండి విముక్తిపొందే మార్గంకూడాను. మరో మార్గంలేదు.

ఫాసిస్టు శత్రువులను ఎదుర్కోడానికి భారత ప్రజలందరిలోనూ ప్రతిఘటనా దీక్షను, దేశభక్తిని రగుల్కొలిపే అవకాశమేగనుక జాతీయ పక్షాలకు ఇచ్చినట్టయితే, ఇక తమ పెత్తనానికి నీళ్ళువదులుకోవలసిన రోజులుకూడా దగ్గరపడతాయని సామ్రాజ్యవాద ప్రభుత్వానికి బాగాతెలుసు. అందువల్లనే ఈప్రభుత్వం మన జాతీయసమస్యా పరిష్కారం కానీయకుండాను, జాతీయప్రభుత్వం ఏర్పడనీయకుండాను, అన్నివిధాలా అడ్డు తగులుతూంది.

దీనివల్లనే స్పష్టమవుతూంది — కార్యదీక్షతో పనిచేయవలసిన బాధ్యత మనపైన ఎంతోఉందని. నిరంకుశ ప్రభుత్వపు చేష్టలు ఎలా ఉన్నప్పటికీ, మనదేశాన్ని రక్షించుకోడానికి జాతీయశక్తులనన్నిటినీ ఐక్య పరచవలసిన విధి మనదని దీనివల్లనే రుజువవుతూంది. మన జాతీయ శక్తులను ఎంతగా ఐక్యపరుస్తామో, ఈ పరాయిప్రభుత్వం అంత ఏకాకి అయిపోతుంది; అంతగా బలహీనమయిపోతుంది. మన జాతీయవాంఛలను ప్రతిఘటించగల శక్తికూడా దానికంతగా తరిగిపోతుంది. మన ప్రజల్ని కాపాడుకొని, వారి క్షేమంకోసం పాటుపడగలశక్తి మన కధికమవుతుంది.

యుద్ధకాలంలో ప్రతిదేశంమీదా ఎంతో కార్యభారం పడుతుంది. దానిని జయప్రదంగా నిర్వహించవలసినబాధ్యత ఆదేశ ప్రభుత్వానిది. కాని మనదేశంలోని పరాయిప్రభుత్వానికిది చేతకాదు. అలాంటప్పుడు, మన జాతీయపక్షాలు ఎంత ఎక్కువగా ఈ కార్యభారాన్ని వహిస్తాయో, అంత అధికంగా ప్రపంచ ప్రజలందరి సానుభూతిని మనంపొందగలం. మనకూ వారికీ, మానవజాతి కంతకూ శత్రువైన ఫాసిజాన్ని నాశనం చేయడానికి,

ఈ చేతకాని పరాయిప్రభుత్వం తొలగి, జాతీయ ప్రభుత్వం ఏర్పరచడం చాలఅవసరమని ప్రపంచ ప్రజలు గుర్తిస్తారు. ఏకకంఠంతో మన జాతీయ వాంఛను బలపరుస్తారు.

ఇదీ, దేశాభిమానం మనల్ని నడిపించవలసిన మార్గం. దురాక్రమణ దారుల నెదుర్కోడానికి జాతీయశక్తులను సమీకరించడం, ఈ ఉద్యమం లోనే జాతీయప్రభుత్వ స్థాపనకుగల ఆటంకాలన్నిటినీ తొలగించుకోవడం- ఆ విధంగా స్వేచ్ఛా జగత్తులో స్వతంత్ర భారతదేశాన్ని నెలకొల్పగల హక్కును సాధించడం - ఇదీ మార్గం. ఎంత సంఘీభావంతో, ఎంత త్వరగా ఈ మార్గాన్ననుసరించిపోతామో అంతత్వరగా జాతీయ ప్రభుత్వాన్ని పొందగలము. ఆలస్యం చేసినా, దారి తప్పినా, మన గతి ఇంకా అధ్వాన్నంకాక తప్పదు.

యూరప్ దేశాల ప్రజల్ని అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు ఫాసిస్టు నరకకూపంలో పడద్రోశాయి. అప్పుడుగాని, ఆప్రజలు - ఇది ప్రజా యుద్ధము, తమశక్తిని కూడదీసుకొని ఈ యుద్ధంలో విజయం సాధించ గలమన్న విషయాన్ని గ్రహించలేక పోయారు. ఈ జ్ఞానోదయం కలిగిన తరువాత ఈనాడు యూరప్‌లో జరుగుతున్నదేమిటి? చర్చిల్ మనోభీష్టాలు కాదక్కడ నెరవేటుతున్నవి - ప్రజాశక్తుల నిర్ణయాలు కొనసాగుతున్నాయి. డార్లన్, బదోలియోలాంటి దుష్టగ్రహాలను అధికారంలో ఉంచాలని చర్చిల్ ఎంత తాపత్రయపడినా అది సాధ్యంకాకపోతూంది. ఫాసిస్టు ద్రోహి మిహిలోవిచ్‌తో పొత్తుమానుకుని, కమ్యూనిస్టు టిటోతో చేతులు కలపక తప్పిందికాదు చర్చిలుకి. ఈనాడు మనమేస్థితిలో ఉన్నాం? 50ఏళ్ళ జాతీయోద్యమ అనుభవం మనకు అండగా ఉంది. ఈ ఉద్యమాన్ని ఇంకా విస్తృతం చేయగల అవకాశాలెన్నో ఉన్నాయి; ఈ ఉద్యమంలో వివిధ శక్తులమధ్య ఐక్యతను ఇంకా గాఢంచేయవలసిన అవసరం చాలా ఉంది. ఈ పరిస్థితుల్లో, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న మీరు నాయకత్వంవహించి, యూరప్‌లో లాగానే ఇక్కడ కూడా చర్చిల్ తన వాంఛల్నిచంపుకొని ఇండియాతో రాజీకిదిగేలా చేయగలరని మానమ్మకము.

ప్రధాన సిద్ధాంతాలకు సంబంధించిన ఇంత పెద్దసమస్యను గురించి మీరు ప్రశ్నించారు. మీ సిద్ధాంతాలు మీకు, మా సిద్ధాంతాలు మాకే ఉంటే క్లుప్తంలో మా దృక్పథాన్ని అర్థంచేసుకోవడం మీకు సాధ్యపడదు.

ఆగస్టు 9 తరువాత మేము చేసిన తీర్మానాన్ని (పీపుల్స్‌వార్ సంపుటి 1, సంచిక 12 లో ఉంది), మీ ఉపవాస వ్రతంపై చేసిన తీర్మానాన్ని (పీపుల్స్‌వార్ సంపుటి 2, సంచిక 33), మా మేదినోత్సవ ప్రణాళికను (సంపుటి 2, సంచిక 44), మీ విడుదలనుగురించి మేము రాసిన సంపాదకీయాన్ని (సంపుటి 2, సంచిక 46). వీటన్నిటినీ చదువవలసిందని మీకు మనవి చేసుకుంటున్నాను. 'ప్రజాయుద్ధం'అనేవిధానాన్ని మేము దైనందిన సమస్యలకు ఎలా అన్వయిస్తున్నామో ఇవి మీకు విశదం చేస్తాయి. ఒకే సిద్ధాంతాన్ని అనుసరించిపోతున్న వారికి, పరిస్థితులను ఇంకా విస్పష్టంగా అర్థం చేసుకోడానికి ఉపయోగపడతాయి 'పీపుల్స్‌వార్'లాంటి ప్రధాన నినాదాలు. కాని, దానిని దైనందిన సమస్యలకు అన్వయించడాన్నిబట్టి దాని బాగోగులను ఇతరులు గ్రహించగలరు. ఈ నినాదం సూచిస్తున్న కార్యక్రమాన్ని బట్టి, అది దేశభక్తిపూరితమా కాదా అన్నది వారు తేల్చగలరు.

రెండవ ప్రశ్న

"మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న కమ్యూనిస్టుపార్టీ ఆదాయ వ్యయాలను తనిఖీచేసే అవకాశం ప్రజల్లో ఎవరికయినా ఇస్తారా? అలాంటి అవకాశం ఉంటే నేను వాటిని చూడవచ్చునా?"

ఏరాజకీయ సంస్థయొక్క ఆదాయ-వ్యయాలనుగాని ఇతరుల తనిఖీ కింద పెట్టవలసిన అగత్యంలేదు. కాని, వాటిని చూడాలనే కుతూహలం మీకు కలిగినందుకు మేమెంతో సంతోషిస్తున్నాం. మమ్మల్ని గురించి డబ్బు విషయంలో మీఎదుట ఎంతో దుష్ప్రచారం సాగుతూంది. మీరంటే మాకెంతో గౌరవము, విశ్వాసమూ ఉంది. ఈవిషయాన్ని గురించి అంతా స్వయంగా తెలుసుకుని, మేము విశ్వాస పాత్రులమో కామో మీయంతట మీరే నిర్ణయించుకోడానికి ఇలా శ్రద్ధ చూపుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది.

మా కోశాధికారి పుచ్చలపల్లి సుందరయ్య. ఆయనిప్పుడు బెజవాడలో ఉన్నాడు. కృష్ణాజిల్లాలో 50,000 ఎకరాలకు అదనంగా నీటి వసతులు కలిగించడంకోసం, వేయిమంది పార్టీసభ్యులను వెంటవేసుకొని కాలువలను మరమ్మత్తుచేస్తూ, వంద్రు మోస్తున్నాడక్కడ. పి. డబ్ల్యు.డి. వారికి ఈపనిచేయించడం చేతకాకపోయింది. ఈపనిగనుక పూర్తిఅయితే కృష్ణాజిల్లాలో పంటలధికంగా పండించి, కరువు వాతబడిన కేరళ సోద

రులకు సాయం పంపడానికి అవకాశం ఉంటుంది. దీనిని గుర్తించే సుందరయ్య సోదర సభ్యులతో ఈకార్యభారం వహించాడు.

మా అకౌంటెంటు (ఆదాయ వ్యయాల లెక్కలువేసే ఉద్యోగి) లైలా. సుందరయ్య భార్య. ఈమెకూడా బెజవాడవెళ్ళింది. లైలా, సుందరయ్యలు త్వరలోనే రానున్నారు అవసరమైతే 48 గంటల్లో బొంబాయి చేరుకొనేలా నేనేర్పాటు చేస్తాను.

మా ఆదాయ వ్యయాళ్లను మీరు స్వయంగా తనికీచేయాలనుకుంటే, వారు దానికి సంబంధించిన రిజిస్టర్లన్నీపట్టుకొని మీరు కోరినప్పుడు, మీరు నిర్ణయించిన చోటికివచ్చి హాజరవుతారు. కాదు - మీ తరఫున ఒక ప్రతినిధిని ఇందుకు నియమించ దలచుకుంటే, ఆయన విశ్వాస పాత్రుడనీ, మాపై నిదివర కేదురభిప్రాయాలు కలవాడు కాదనీ, మే మెరిగున్నవారై ఉండాలి.

మా అకౌంట్లు ఒక వ్యాపారసంస్థ అకౌంట్లంత పకడ్బందీగా ఉండవు. ఎందువల్లనంటే - రహస్య దినాల్లో ఏరోజు పోలీసువాళ్ళకు ఏది పట్టుబడుతుందో తెలియనిరోజుల్లో, రిజిస్టర్లు, అకౌంట్లుఉంచడం చాల ప్రమాదకరము, తెలివితక్కువ పని. అందువల్ల అకౌంట్లు సరిగా ఉంచే విద్యను ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాం. ఈవిషయాన్ని మనసులోఉంచుకుంటే, మాఅకౌంట్లు ఇప్పుడున్నంత చక్కగా అయినా ఉన్నందుకు మీరు మెచ్చుకుంటారని గట్టిగా చెప్పగలను.

మా రిజిస్టర్లలో కొంతమంది విరాళాలిచ్చినవారి పేర్లుండవు. ఇలాంటి గుప్తదాతలు మీకుకూడా ఉండిఉంటారు కాని, ఈ గుప్తదాత ప్రభుత్వమేనేమో అనే అనుమానం కలగకుండా ఉండడంకోసం మీకు (మీ ప్రతినిధికిమాత్రం కాదు) వారి పేర్లుకూడా చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

లక్షలకు విలువైన స్వంత ఆస్తిగల కామ్రేడ్స్‌ని కొంతమందిని మీకు పరిచయం చేయగలను. వీరు తమ యావదాస్తిని పార్టీకి ఇచ్చివేయడానికి ప్రతిజ్ఞ తీసుకొన్నారు.

వీరిలో కొందరు మీ కాశ్చర్యం కలిగిస్తారని నాకు బాగాతెలుసు. పేరెన్నికగన్న కుటుంబాల బిడ్డలువారు. వారితండ్రులకు ఆస్తిపైనున్నంత అభిమానం దేశంమీద లేకపోయింది. ఈ కామ్రేడ్సుతో రెండేసి నిమి

షాలు మాట్లాడితేచాలు, వారు స్వార్థరహితులైన యువకులని మీకు స్పష్టమవుతుంది. వీరిని కన్న పెట్టుబడిదారీ, జమీందారీ వర్గాల్లో ఇలాంటి దేశభక్తులు పుట్టడం అసాధారణ విషయమని మీరే గ్రహించగలరు.

మీకు మరికొన్నివిషయాలుకూడా చెబుతాను. ఇంకా ఏమైనా అనుమానాలు మీకు మిగిలిఉంటే, వీటితో తీరిపోగలవు. మాకు ధనసహాయం ఎవరుచేసేదీ, దానిని ఎక్కడ ఎలా మేము ఖర్చుపెట్టేదీ ఈ దిగువవారికి చాలవరకు తెలుసు. ప్రభుత్వం దగ్గరనుంచి మాకొక చిల్లిగవ్వయినా రాదని వీరు బాగా ఎరుగుదురు :

— మియాన్ ఇఫ్తికారుద్దీన్ (పంజాబు కాంగ్రెసు నాయకులు), వారి భార్య.
— షౌకత్ అన్సారీ, జోహ్రాబు.
— యన్. యం. జోషి.

డాక్టరు సుబ్బరాయన్‌గారిని, వారిభార్య రాధాబాయి సుబ్బరాయన్ గారిని అడగండి — మోహన్‌కి, పార్వతికి (వారి బిడ్డలు, మా పార్టీ సభ్యులు) తమ ఆస్తిపస్తే అదేమవుతుందో. పార్టీ కార్యక్రమానికి తమ కాలాన్నంతా అంకితంచేసిన కామ్రేడ్స్‌యొక్క ఆస్తులేమవుతున్నాయో వారికి తెలుసు — ఆవిషయం వారి నడగండి.

ఈ సందర్భంలో మిమ్మల్ని ఒకవిషయం అడక్కుండా ఉండలేకుంటున్నాను. కొన్ని గ్రామసీమల, పట్టణప్రదేశాల జాబితా మీకిస్తాను. మేము కార్యదీక్షతో పనిచేసినప్రదేశాల్లో ఇవికొన్ని. మాసంగతి అక్కడి ప్రజలకు పూర్తిగా తెలుసు. నేను పర్యటనకోసం బయలుదేరేటప్పుడు, ఈ ప్రదేశాల్లో ఎక్కడికయినాసరే ప్యారీలాల్‌గారిని నావెంట పంపండి. నేను వచ్చి పార్టీ రాజకీయాలనుగురించి మాట్లాడతాను, కాబట్టి వచ్చి వినండని ఒక చిన్న ప్రకటనమాత్రమే జరుగుతుంది. పదివేలకు తక్కువ కాకుండా, యాభైవేలవరకు ప్రజలువచ్చి కూర్చోవడం వారు చూడగలరు. 1920 జాతీయోద్యమం నాటి ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని తిరిగి చూడగలరు. చెప్పవలసిందంతా చెప్పి, చివరకు పార్టీనిధికి విజ్ఞప్తిచేస్తాను. వచ్చినవారిలో అత్యధికసంఖ్యాకులు విరాళాలుకురిపించడం ఆయన చూడగలరు— ఆ ప్రజలు కనబరిచే త్యాగదీక్షకు ఆయన ఆనందబాష్పాలురాల్చక తప్పదని చెప్పగలను.

ఏ ప్రజలనుండైతే మీరు విరాళాలు వసూలుచేస్తారో, ఆ ప్రజలే మాకుకూడా దాతలు. దేనివల్లనైతే మీకది సాధ్యమయిందో, ఆప్రజాసేవ దీక్షవల్లనే మాకుకూడా అది సాధ్యమవుతూంది. మీరు చేయగలవానిని ఇతరులుకూడా చేయగలరని మీరెందుకు తలంచరు? స్వార్థత్యాగానికి మీరు వరవళ్లుదిద్దారు. దేశసేవకోసం ప్రజలనుండి నిధులను వసూలుచేసే సత్సంప్రదాయాన్ని నెలకొల్పారు. మీ అడుగుజాడలనే అనుసరించి ముందుకు పోతున్నందుకు మేమెంతో గర్విస్తున్నాము.

బిడ్డలు తమ తలిదండ్రులను అనుసరించడం సహజం. కాని మేమలాంటి బిడ్డలంకాము. మా తండ్రుల్ని, తల్లుల్ని, ఇంకా మాతాతల్ని, అవ్వల్ని మా పార్టీలోకి తేడానికి నిరంతరం కృషిచేస్తాము. పెద్దలు పిన్నలు - అంతా పార్టీలోచేరిన కుటుంబాలెన్నో ఉన్నాయి.

అయితే మీకొకప్రశ్న తట్టవచ్చు. కొంతమంది చిత్తశుద్ధిగల కాంగ్రెసువాదులే మాపైని లేనిపోని కథలు మీతో చెప్పుతుంటారు. వారా కథలను ఎలా నమ్మగలిగారా? అన్న ప్రశ్న మీకు తట్టవచ్చు. ఈ సందర్భంలో మీరొక విషయం గుర్తించాలని కోరుతున్నాను. మీఅరెస్టు తరువాత ప్రారంభమయిన "పోరాటం", కాంగ్రెసు ఆదేశానుసారంగానే జరుగుతూందనీ, అది "జాతీయ" సమరమేననీ, చాలమంది కాంగ్రెసువాదులు నమ్మారు. ఈ "సమరం"లో మేము చేరకపోయేసరికి, సహజంగా వారికి మాపైని పట్టరాని ద్వేషం కలిగింది. ఆ "పోరాటా"న్ని నడుపుతూన్న కాంగ్రెసు సోషలిస్టులు, ఫార్వర్డుబ్లాకువారు ఈ ద్వేషాన్ని తమ కార్యక్రమానికి అనుకూలంగా ఉపయోగించుకున్నారు. ఈ ద్వేషాన్ని ఇంకా రెచ్చగొట్టడానికి మేము ప్రభుత్వానికి అమ్ముడుపోయామనే తుచ్ఛమైన అసత్యాన్ని కూడా ప్రచారం చేశారు. ఆ "పోరాటం" నీళ్లుగారిపోతున్నకొద్దీ కాంగ్రెసువాదులు మా విజ్ఞప్తుల నాలింపసాగారు. ఈమార్పు "పోరాట" నాయకులకు గిట్టలేదు. మాపై దుష్ప్రచారం ఇంకా తీవ్రం చేశారు. ఈ విధంగా విధ్వంసక కార్యక్రమానికి నాయకత్వం వహించినవారే ఈ దుష్ప్రచారాన్ని ప్రారంభించి, తీవ్రంగా సాగించినవారు. ఆ నాటి రాజకీయ వాతావరణంలో వారి కార్యక్రమం ఎక్కువ ఆకర్షణీయమయింది. దాని నెదుర్కొన్నది మేమొక్కరమే. అందువల్లనే వారి దుష్ప్రచారం బాగా చలామణీఅయింది.

మమ్మల్ని ఎరిగిన, మా కార్యనిరతిని చూచిన నిజాయితీగల వారెవ్వరూ ఈ పచ్చిఅబద్ధాలను పలుకరు. కాని, విచారపడవలసిన విషయం ఏమంటే, మమ్మల్ని స్వయంగా, బాగా ఎరిగున్నవాళ్లెవ్వరూ మిమ్మల్ని ఇంతవరకు కలుసుకోలేదు. పోనీ, అందరి కాంగ్రెసువాదుల దృష్టిలోకి వచ్చి, ఈ దుష్ప్రచారానికి వారు లొంగిపోకుండా చేయగలిగామా అంటే - మా కార్యక్రమం ఇంకా అంత వ్యాప్తిచెందలేదు. కాని, త్వరలోనే ఈ విషప్రచారాన్ని పటాపంచలు చేయగలమనడం నిస్సందేహం!

మూడవ ప్రశ్న

> "గత రెండు సంవత్సరాల్లోను కార్మికులచేత సమ్మెలు చేయించిన నాయకులను అరెస్టు చేయడంలో కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వానికి చాల తోడ్పడిందని అంటున్నారు - దీని విషయం ఏమిటి?"

ఇలాంటి తుచ్ఛమైన ఆరోపణ చేయడం చాల సులభం - కాని, దానిని రుజువు చేసుకోవడం చాల కష్టం. తన ఆరోపణను రుజువు చేసుకోమని సవాల్ చేస్తాడు ఒక న్యాయవాది ఫిర్యాదిని. ఇలా రుజువు చేసుకోవడం ఎల్లప్పుడూ సాధ్యమయే పనికాదు: కాని, నేను న్యాయవాదిలా ప్రవర్తించను. విశాల దృష్టితో, రాజకీయంగా, మీ ప్రశ్నకు జవాబు చెబుతాను. అదే సరియైన సమాధానం కాగలదు.

మొట్టమొదటి విషయం. మేము ప్రభుత్వానికి అమ్ముడుపోలేదని మీకు నిర్ధారణమయినట్లయితే - కార్మిక నాయకులను పోలీసులకు పట్టి ఇవ్వవలసిన పని మేము పెట్టుకోమని మీరు సులభంగా గ్రహించగలరు.

రెండో విషయం. అహమదాబాదులోను, జంషడ్పూరులోనుతప్ప, భారత కార్మిక వర్గానికంతటికీ మాపార్టీ ఏకైక నాయకత్వం వహిస్తోంది. మొత్తంమీద భారత జాతికి కాంగ్రెసు మహాసంస్థ ఎలా నాయకత్వం వహిస్తోందో, కార్మికవర్గంమీద మాపార్టీ అలాగే నాయకత్వం వహిస్తోంది. బహిరంగసభల్లో బట్టబయలుగా, మాప్రతికక్షుల ఆరోపణలకు జవాబు చెబుతాం. వారిని సవాలు చేస్తాం - వచ్చి కార్మికుల ఎదుట నిలబడి తమ దృక్పథాన్ని వెల్లడిచేయమని.

ఇంచుమించు కార్మిక నాయకులందరూ మాపార్టీ సభ్యులే. సభ్యులు కానివారు కొద్దిమందికూడా మామిత్రులు, సానుభూతిపరులే. కార్మికోద్య

మం గురించి యేకాస్త తెలిసినవారు కూడా మాపైని ఇలాంటి ఆరోపణ చేయగలరని నేననుకోను. ఒక్క కాంగ్రెసు సోషలిస్టులే ఈనీచానికి ఒడిగట్ట గలరు.

ఇప్పుడున్న కార్మిక నాయకులందరికన్నా శ్రీ యన్. యం. జోషీ గారు వయోధికులు. అఖిల భారత ట్రేడుయూనియన్ కాంగ్రెసుకి వారు ప్రధాన కార్యదర్శి. వారు కమ్యూనిస్టులుకారు. లోగడ ఎన్నో విషయాల మీద మేము వారి నెదుర్కొన్నాం. ఇప్పుడుకూడా అనేక అంశాలమీద వారికీ మాకూ భేదాభిప్రాయాలున్నాయి. కార్మికోద్యమంలో మాస్థానమేదో ఇతరులకన్నా వారికి బాగా తెలుసు. కార్మికులకు మేమేమిటి బోధిస్తామో, వారిలో ఎలా పనిచేస్తామో, మమ్మల్ని విమర్శించేవాళ్ళను, వ్యతిరేకించే వాళ్ళను మేమేవిధంగా ఎదుర్కొంటామో వారికి పూర్తిగాతెలుసు. వారితో కొన్ని నిమిషాలు మాట్లాడితే చాలు మీకు యదార్థం తెలుస్తుంది.

నేటి పరిస్థితుల్లో సమ్మెకార్యక్రమం (Strike policy) దేశక్షేమానికి భంగకరమని మేమెంచాము సమ్మె కార్యక్రమం అటు జపాను దురాక్రమణదారులకు తోడ్పడడం మాత్రమే కాకుండా, ఇటు మన ప్రజల ఆర్థిక దుస్థితినికూడ మరింత దుర్భరం చేస్తుందని మేము గుర్తించాం. అందువల్ల సమ్మెకార్యక్రమాన్ని మేము విసర్జించాము. తమ స్థితి నానాటికి దుర్భరమయిపోతున్నప్పటికీ, కార్మికులు రెచ్చిపోయి సమ్మెలకు దిగకుండా ఆపగలిగాము. దీనినిబట్టే మీరు గ్రహించగలరు, కార్మికుల్లో మా కెంత పలుకుబడి ఉందో. అంతేకాదు. దేశక్షేమమే తమ క్షేమమని కార్మికులు ఎంతగా గుర్తించారో కూడా దీనినిబట్టి స్పష్టమవుతుంది.

నాలుగవ ప్రశ్న

కాంగ్రెసు సంస్థలో జొరబడాలనే విధానాన్ని కమ్యూనిస్టు పార్టీ ఒక దురుద్దేశంతోనే, అనుసరిస్తున్నదని అనుకుంటున్నారు.

"కాంగ్రెసుసంస్థలో జొరబడాలనే విధానాన్ని" మేము అనుసరించడము అంటూ ఒకటిలేదు. ఎందువల్లనంటే, మాపార్టీ పుట్టిన దగ్గర్నుంచీ కాంగ్రెసు మహాసంస్థలోనే ఉంది. మీరట్ కుట్రకేసులో ప్రోసెక్యూటర్ గా ఉండిన కీ. శే. లాన్గోర్డు జేమ్సుకూడా మాపైని ఈ ఆరోపణనే చేశాడు. ఆమాటలు విని కోర్టులో మేము విరగబడి నవ్వాము ఆ ఆరోపణ చేయడంలో అతనికొక ఉద్దేశంఉంది. కమ్యూనిస్టులుకానట్టి ఇతర కాంగ్రెసు

వాదుల్ని బెదరగొట్టి, మానుంచి దూరంచేయాలనే అతనిఎత్తుగడ. ఆరోజుల్లో బ్రిటిషు ఏజంట్ల ధోరణిఅది. ఈనాడు జపాను ఏజంట్లు ఆరాగమే ఆలపిస్తున్నారు. ఇరువురూ భారతజాతి శత్రువుల బంటులే. జాతిని అయోమయావస్థలో పడద్రోయడమే వీరి ఆశయము

మాది దురుద్దేశమో కాదో సోదర కాంగ్రెసువాదులు నిర్ణయించవలసింది ఇలాంటివారి మాటలనుబట్టికాదు. వారు నిర్ణయించవలసిందీ, మేము నిరూపించుకోవలసిందీ, మా కార్యాచరణనుబట్టే. లోగడ సోదర కాంగ్రెసువాదుల ప్రేమను, గౌరవాన్ని మేము చూరగొన్నాం. ఇక ముందుకూడా ఇంకా అధికతరంగా పొందగలమనే మేమాశిస్తున్నాం. ఏ. ఐ. సి. సి. సభ్యులుగా మాకామ్రేడ్సుని ఎన్నుకున్నారు; రాష్ట్రకమిటీలలో ముఖ్యస్థానాల నిచ్చారు.

దేశభక్తి ప్రేరితులమైన భారతజాతి బిడ్డలము మేము. జాతి అంతటికీ ఏకైక ఆశయమయిన స్వాతంత్ర్యసాధనకు, ఇనుమడించిన శక్తి ఉత్సాహాలతో పోరాడగల అవకాశంకోసమే జాతీయ మహాసంస్థలో ఉన్నాం. స్వతస్సిద్ధమైన హక్కునుబట్టే మేమీ మహాసంస్థలో ఉన్నాం. అందులో ఉండగలగడం ఒక మహాభాగ్యం. ఎలాంటి దుష్ప్రచారాలు కూడా మమ్మల్నీహక్కును, ఈ మహాభాగ్యాన్ని వదలుకొనేలా చేయజాలవు.

అయిదవ ప్రశ్న

"కమ్యూనిస్టుపార్టీ విదేశీయుల చెప్పుచేతల్లో ఉండటంలేదా?"

తన దేశస్థులకు, ప్రపంచ ప్రజలకు ఏదిక్షేమమో కమ్యూనిస్టుపార్టీ గ్రహిస్తుంది. దానినిబట్టే తన విధానాన్ని నిర్ణయించుకుంటుంది. అంతర్జాతీయ కమ్యూనిస్టుసంస్థ ఉన్నంతకాలం మమ్మల్ని 'మాస్కో ఏజంటు'లని ఆడిపోశారు. ఆసంస్థ రద్దయినతరువాతకూడా ఇలాంటి ఎత్తిపొడుపులే ఇంకా వినబడడం వింతగాఉంది. ఈవిషయానికి సంబంధించిన కొన్ని కాగితాలు (డాక్యుమెంట్లు) పంపుతున్నాను. అవి మీ కన్నివిషయాలు తెలుపగలవు.

కమ్యూనిస్టుపార్టీ విశ్వవ్యాప్తమయిన ఒక విప్లవకుటుంబం. అది అన్నిదేశాల్లోనూ ఉంది. ఈ కుటుంబంలోని వారందరూ ఒకే సిద్ధాంతాన్ననుసరిస్తారు. వారి ఆశయంకూడా ఒకటే — తమ సోదరదేశస్థుల,

ప్రపంచ ప్రజల, స్వాతంత్ర్యంకోసం పోరాడటం. బ్రిటన్, అమెరికా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల కమ్యూనిస్టుపార్టీలు ప్రచురించిన పత్రికలు, పత్రాలు మీకు పంపగలను. అమెరీముతాను విషప్రచారకులుగాను, ఆగస్టు 9 తరువాత భారతజాతిని రెచ్చగొట్టిన కుట్రదారులుగాను, ఈ ప్రచురణలు ఖండించాయి. కాంగ్రెసు నాయకులను విడుదలచేయాలనీ, నిజమైన జాతియప్రభుత్వాన్ని ప్రాతిపదికగా తీసుకొని భారతసమస్యను పరిష్కరించాలనీ, ఈ పార్టీలు అచంచలదీక్షతో ఆందోళనచేశాయి.

యుద్ధం తీవ్రతరమవుతూన్నకొద్దీ, కమ్యూనిస్టుపార్టీల కార్యదీక్షను గురించి మీరింకా ఎక్కువగా వింటారు. శ్రీ ప్యారీలాల్‌గారికి పంపిన పుస్తకాల్లో ఫిన్లండు, యుగోస్లావియా, ఫ్రాన్సు, చైనా దేశాలను గురించిన పుస్తకాలు కూడా ఉన్నాయి. మా సోదర పార్టీలలో ఒక్కొక్కటీ, తన దేశపరిస్థితులను, అంతర్జాతీయ పరిస్థితులను ఏ విధంగా పరిశీలిస్తూందో, తమ ప్రజలకు ఎలాంటి కార్యక్రమం సూచిస్తూందో, దానిని కొనసాగించడానికి ఏవిధంగా కృషిచేస్తూందో ఈ పుస్తకాలు మీకు తెలుపగలవు.

మొట్టమొదట మిమ్మల్ని కలుసుకున్నప్పుడు అపనమ్మకాలతోనే మాతో సంప్రతిస్తున్నానని మీరు నిష్కపటంగా నాతోచెప్పారు. నేను కూడా మీతో నిష్కపటంగానే ఉంటాను. మీ ప్రశ్నలు మమ్మల్నెంతో బాధపెట్టాయి. ఎందువల్ల నంటారా ? కమ్యూనిజంయొక్క గర్వశత్రువులు ప్రపంచమంతటా సాగిస్తున్న విషప్రచారమే ఈ ప్రశ్నల్లో ప్రతిధ్వనిస్తూంది. అదివరకే పాతుకుపోయిన దురభిప్రాయాలున్నవారే ఈ ప్రచారాన్ని నమ్మగలరు. మాదొక కొత్తశక్తి - దినదినాభివృద్ధి పొందుతూన్న శక్తి. భారజాతి పొత్తిళ్ళలో పుట్టిపెరిగాము. దేశాభిమాన జ్వాలతో ఉద్దీపితులమై ముందుకువచ్చాము. ఈ జ్వాలను రగిల్చిందెవరు ? మేము కాదు. మీబోటి పెద్దలే ప్రతిదేశంలోనూ దానిని రగిల్చారు. పాతుకుపోయిన భావాలనుండి ప్రక్కకుమరలి నూతన భావాలను అవగాహన చేసుకోవడం అంత సులభమైన పనికాదని నేనెరుగుదును. తాను నెలకొల్పిన సంప్రదాయాలను తన బిడ్డలు ఇంకా ముందుకు తీసుకుపోగలుగుదురని నమ్మడం కూడా కష్టమే. కాని, మీరీ దిగువ విషయాలను ఆలోచిస్తారని ఆశిస్తున్నాము :

(క) భారతజాతికి గొప్పనాయకులు మీరు. ఇతరులు మిమ్మల్ని అపార్థం చేసుకొనేలా చిత్రించబడటం, విషప్రచారాలకు గురికావడం, మీ అనుభవంలోని విషయాలే. అయినప్పటికీ మీరు మా జాతీయ నాయకులు కాగలిగారు.

(ఖ) కమ్యూనిజానికి పితామహుడు మార్క్సు. అతని కాలం నుంచీ మా సిద్ధాంతాలకు అపార్థాలు కలిగించినట్లుగా మరిదేనికీ జరుగలేదు. లెనిన్, స్టాలిన్లపై దుష్ప్రచారాలు సాగించినట్లుగా మరేయితర ప్రజానాయకులపైనీ సాగలేదు. ఇంతజరిగినప్పటికీ భూగోళంలో ఆరవభాగములో సోవియట్ రాజ్యం వెలిసింది; ప్రతిదేశంలోనూ కమ్యూనిస్టుపార్టీలు దినదినాభివృద్ధి పొందుతున్నాయి. మార్క్సు, లెనిన్, స్టాలిన్ల ఉద్యమసాఫల్యతకు ఇవే మహత్తరమైన నిదర్శనాలు.

(గ) మాలో నాటుకుపోయిన పాతభావాలను ప్రతిఘటించే మేము కమ్యూనిజాన్ని స్వీకరించాము. కమ్యూనిస్టులమయిన నాటినుండీ దుష్ప్రచారాన్నెదుర్కొంటూనే ఉన్నాం. దీని నెదుర్కొంటూనే సోదర ప్రజల మధ్యకు పోగల మార్గాలను అన్వేషిస్తున్నాం. దురభిప్రాయాలు సత్యాన్ని మరుగుపుచ్చలేవనీ, దేశభక్తి ప్రేరితమైన సంస్థను విషప్రచారాలు అణచివేయలేవనీ, మేము అనుభవంమీద గ్రహించాము.

(ఘ) మమ్మల్ని మీరంతగా ఎరుగరు. నెహ్రూగారికి మమ్మల్ని గురించి ఇంకా ఎక్కువతెలుసు.

మేమంటే మీ కిష్టంలేదనీ, మమ్మల్ని అంతగా లెక్కచేయలేదనీ, మేమెరుగుదుము. మేము అప్పుడప్పుడు నెహ్రూగారిని కలుసుకుంటుండేవాళ్ళం; కాంగ్రెసులో చర్చకువచ్చే జాతీయ, అంతర్జాతీయ సమస్యలను గురించి మా అభిప్రాయాలను వారికి తెలుపుకుంటుండేవాళ్ళం. ఈనాడు ఖైదుకొట్టులో మ్రగ్గుతున్నారు. వారూ, ఇతర వర్కింగుకమిటీ సభ్యులు లేకుండానే, పరిస్థితుల నన్నిటినీ అవగాహన చేసుకొని, జాతికొక మార్గం చూపవలసిన బాధ్యత మీపైని పడింది. మేము దినదినాభివృద్ధిపొంది, నేడు దేశంలోని రాజకీయపార్టీల్లో కాంగ్రెసు, లీగుల తరువాత మూడవస్థానానికి చేరుకున్నాం. మీరు మమ్మల్ని అపార్థం చేసుకుంటే అనర్థదాయకమవుతుంది. అయినప్పటికీ దేశభక్తియుతమైన మా రాజకీయ విధానంపై ఆధారపడే మేము ప్రజలఎదుట నిలబడతాం. ఇంతవరకు ప్రజలు మాపట్ల

వెల్లడించిన సదభిప్రాయం మాకు అంతులేని ఆత్మవిశ్వాసాన్ని చేకూర్చింది. ఆత్మపరీక్ష చేసుకొని మా లోటుపాటులను గుర్తించి, వాటిని పరిదిద్దుకోగల ధైర్యాన్ని కూడా మాకు ప్రసాదించింది. కాని మీ సంగతేమిటి? వివిధ దృక్పథాలను అవగాహన చేసుకొని, దేశస్థులసందరినీ ఏకైక గమ్యస్థానం చేర్చగల బాటను వేయవలసిన బాధ్యత, ప్రప్రధాన జాతీయనాయకులైన మీపైనుంది. అలాంటిమీరు మమ్మల్ని అపార్థంచేసుకొన్నట్లయితే ఈ బాధ్యతను మీరు జయప్రదంగా నిర్వర్తించలేకపోతారు.

ప్రభుత్వంయొక్క దయాదాక్షిణ్యాలతోనే మేమంత వృద్ధిలోకి వచ్చామని కాంగ్రెసు సోషలిస్టులంటారు. కాంగ్రెసువారు జైళ్ళలో వుండటం వల్లనే మేము బలపడ్డామని వాళ్ళు చెబుతున్నారు.

మిమ్మల్నీ, ఇతర కాంగ్రెసు నాయకుల్నీ విడుదల చేయాలని మా పార్టీ తదేక దీక్షతో ఆందోళన చేసింది. కాంగ్రెసు జపాను అనుకూలసంస్థ అని సాగించిన విషప్రచారాన్ని మాపార్టీ తీవ్రంగా ఎదుర్కొని పోరాటం సాగించింది. కాంగ్రెసుయొక్క ఫాసిస్టు ప్రతికూల తత్వాన్ని ప్రపంచానికంతటికీ ఎరుకపరచింది. జాతీయ ప్రభుత్వ స్థాపనను ప్రాతిపదికగా తీసుకొని, భారత సమస్యను పరిష్కరించాలని కోరుతూ వచ్చింది. ఇలాంటి పార్టీని ప్రభుత్వం ఎందుకు పోషిస్తుంది?

ఈరెండేళ్ళలో మాకామ్రేడ్సుని నలుగురిని ప్రభుత్వం ఉరితీసింది. (వారి విషయం పీపుల్స్‌వార్ సంపుటి 1 సంచిక 40 లో మీరు చదువవచ్చు). సుమారు 400 మంది జైళ్ళలో ఉన్నారు. వందమంద యావజ్జీవ శిక్షలను అనుభవిస్తున్నారు. ఇదేనా ప్రభుత్వం మాకు తోడ్పడడం?

ఇదివరలో కాంగ్రెసుసంస్థ నిషేధించబడింది. అప్పుడు-1920 లో లిబరల్‌పక్షంవారు అభివృద్ధి పొందగలిగారా? బానిసదేశాల్లో ప్రజాసేవచేసే పక్షమే, దేశభక్తితో కూడుకున్న పంథాను ప్రజలకు చూపగలపక్షమే, వృద్ధిలోకి రాగలదు. మిగిలినవన్నీ పుట్టగొడుగుల్లా అంతరించిపోతాయి.

ఆహారసమస్యమీదా, ముస్లింలీగును గురించీ మీకు రాస్తానని వాగ్దానం చేశాను. కాని, ఇప్పుడు మీరు ఆరోగ్యాన్ని కోలుకొనేంతవరకూ పంపదలచుకోలేదు. ఇంత పెద్ద ఉత్తరం రాయడమే ఒక నేరం చేసినట్లు నేను భావిస్తున్నాను.

వినయపూర్వక అభివందనాలు,
పి. సి. జోషి.

IV

గాంధీ మహాత్మునికి పి. సి. జోషి జాబు

బొంబాయి, 1944 జులై 26

ప్రియమైన గాంధీజీకి,

మీప్రశ్నలు సకాలంలో నాకుచేరాయి. వాటికి జవాబుకూడా పంపించాను. దాన్ని మీరు చదివినందుకు సంతోషంగావుంది. మీరు మోహన్‌కి రాసిన ఉత్తరాన్నిబట్టి, ఏరోజైనా మీనుంచి జవాబురావచ్చు దానికోసం ఎదురుచూస్తున్నాను. మీరు నాకు పంపిన చీటీనిగురించి, దానికి నేనిచ్చిన జవాబునుగురించి, వార్తలు యెలా వ్యాపిస్తున్నాయో చూచినట్లయితే, రాజకీయరంగంలో మనదేశీయుల సభ్యత ఎంత నీచస్థితిలోవుందో తెలుసుకొనవచ్చు. ఇదిచూచి, నావొళ్లు జలదరిస్తోంది. ఈవిషయమై మీరు భోగట్టా చేయదలచుకుంటే, మోహన్ కొంతవరకు సహాయపడతాడు.

నేను మీకు రాసినట్లు, నేను మీకు పంపిస్తానని వాగ్దానంచేసిన మెమోరాండములు యింకాపంపలేదు. ఎందువల్లనంటే, మాపట్ల మీకుగల దురభిప్రాయాలు తొలగనిదే వాటిని పంపడంవల్ల మీకూ ఉపయోగం ఉండదు; నా కాలమూ వృధాఅవుతుంది. ధైర్యంగాను, ప్రజలపట్ల గాఢాభిమానంతోను, నిర్వహించవలసిన ఏపనికి మీరు మమ్మల్నిపిలిచినా, మేం సిద్ధంగా ఉన్నాం.

వినయపూర్వకమైన అభివందనాలతో,
పి. సి. జోషి

V

పి. సి. జోషికి గాంధీ మహాత్ముని లేఖ

మకాం : పంచగని
1944 జులై 30

ప్రియమిత్రమా,

మీరు జూన్ 4 వ తేదీని రాసిన ఉత్తరం, శ్రీ కుమారమంగళం గారిద్వారా మీరు జులై 26 వ తేదీని పంపినఉత్తరం, సకాలంలోచేరాయి.

నేనడిగిన మొదటిప్రశ్నకు మీరువ్రాసిన జవాబు మరొక ప్రశ్నకు దారితీస్తూంది. మిత్రరాజ్యాలలో యిప్పుడు ప్రధానపాత్ర వహిస్తున్నవారు

నిజమైన ప్రజాస్వామ్య విధానానికి వ్యతిరేకులైనప్పటికీ, యుద్ధం ముగిసేటప్పటికి వారిప్లానులు తలక్రిందులౌతాయనీ, ప్రపంచ ప్రజలు ఒక్కసారి చైతన్యవంతులై ప్రస్తుతమున్ననాయకుల్ని పడగొడతారనీ, మీఅభిప్రాయమైనట్లు నేనర్థం చేసుకున్నాను. "ప్రజలు" అనేశబ్దం మీరు వాడినప్పుడు మన దేశస్థులుకూడా ఆ ప్రజల్లో ఒక భాగమేననీ, యితర ఆసియాఖండ వాసులూ — నీగ్రోలుకూడా ఆ "ప్రజల"కిందికి వస్తారనీ, జర్మనీ, జపాన్ దేశాల కార్మికవర్గంకూడా వస్తుందనీ, మీ అభిప్రాయమైనట్లు నేనర్థం చేసుకొంటున్నాను. అదే మీ అభిప్రాయమైనట్లయితే, దానితో నేను ఏకీభవింపజాలనని ఒప్పుకుంటున్నాను. అయితే, నన్ను ఒప్పించడానికి మీకు హక్కువుంది; నేనుకూడా మీవాదనను వింటాను. మీవాదన సరియైనదేనని నాచేత అంగీకరింపజేయండి. కాని, యీలోగా, "ప్రజాయుద్ధం" అనే శీర్షిక వాడ్డంవల్ల చాలా వక్రభాష్యాలకు అవకాశమిస్తుందని నేను మీకు సూచిస్తున్నాను. కనీసం ఒక ప్రజాపక్షం ఈయుద్ధాన్ని "ప్రజాయుద్ధం"గా పరిగణిస్తున్నట్లు ఇండియాప్రభుత్వం ప్రకటించుకొనేటందుకు అవకాశం కలుగుతూంది. అంతేకాదు. కొంతకాలంవరకు నాజీకూటమిమీద చేయబడ్డయుద్ధం సామ్రాజ్యవాద యుద్ధంగాఉంది. రష్యా కొద్దిగామిత్రరాజ్యాల పక్షం అవలంబించినంతమాత్రాన "ప్రజాయుద్ధం"గా యెలా మారిపోయిందో ఊహించడం కష్టం.

ఇది నా ఖచ్చితమైన అభిప్రాయం అయినప్పుడు, "ఈయుద్ధం ప్రపంచాన్నంతటిని రెండుపక్షాలుగా చేసింది." అనే మీ వాదనకు జవాబు చెప్పడం అనవసరం. ముందు నుయ్యి, వెనుక గొయ్యి కనపడుతూంటే, యెటునడిచినా ముప్పు వాటిల్లక తప్పదు. అందువల్ల తుపానుమధ్య నిలబడి ఉండడమే మంచిదని నా అభిప్రాయం. ఇంతకంటె నేనొక మంచిమార్గం సూచించియున్నాను. కాని, అధికారవర్గం దాన్ని తృణీకరించింది. ఆలా తృణీకరించడం సహజమేకూడా. ఎందువల్లనంటే, ఇండియానుంచి తమ యినుపపిడికిలిని సడలించడం వారి కిష్టంలేదు. ఈ వుత్తరం మీకు రాస్తున్న సమయంలోకూడా మీవాదనను అర్థం చేసుకోడానికి పదేపదే చదివాను. కాని, ప్రతిపేరా వెగటుగా తోస్తోంది. ఎందువల్లనంటే, మీవాదన యదార్థపరిస్థితులకు భిన్నంగాఉన్నట్లు నాకు కనపడింది. నా మొదటిప్రశ్నకు మీరురాసిన యీ జవాబును పరిశీలించ

డంలో మీ పార్టీయందు నాకుగల అపోహలు యేవిధంగాను అడ్డురావు. నిష్పక్షపాత దృష్టితోనే మీ వాదనను పరిశీలిస్తాను.

రెండవ ప్రశ్న

మీ జవాబు నాకు పూర్తిగా సంతృప్తిని కలిగించింది. మీకువచ్చే ధనసహాయాన్ని గురించి యిక ఎప్పుడూ మిమ్మల్ని రుజువు అడగను.

మీరిచ్చిన జవాబుల విషయంలో నా అభిప్రాయం తెలియజేశాను. అయితే, నాకుగల చిక్కుల్ని మీ యెదుట పెట్టవలసిఉంది. మిగతా ప్రశ్నలకు మీ రిచ్చిన జవాబుల విషయంలో స్పష్టంగా నా అభిప్రాయం చెప్పడం సాధ్యం కాకుండాఉంది. మీ జవాబులు నా కర్థమయాయి. అయితే, మీపార్టీని గురించి నాలోకొన్ని దురభిప్రాయాలుఉన్నాయి. అవి లేకపోయినట్లయితే, మీ జాబులను అంగీకరించడంలో నాకెట్టి సంశయం ఉండేది కాదు. నా చిక్కులు నిజమైన చిక్కులు. సానుభూతితో మీరు వాటిని ఆలోచించాలి. మీపట్ల నాకు కొన్ని దురభిప్రాయాలున్నాయని నేను ఒప్పుకొంటున్నాను; ఓపికతో వాటిని తొలగించడానికి మీరు పూర్తిప్రయత్నం చేయమని విజ్ఞప్తి చేస్తున్నాను. నన్నెవరితో మాట్లాడమని మీరు సూచిస్తారో, వారితో మాట్లాడ్డానికి నేను సిద్ధంగాఉన్నానని హామీ యిస్తున్నాను. ఏది చదవమని మీరు చెబితే, అది చదవడానికి సిద్ధంగా ఉన్నాను. మీరు చేసే యేవాదననుగాని, ఉదహరించే యే ఉదంతాన్నిగాని, నేను నిష్పక్షపాత బుద్ధితో పరిశీలించడానికి సిద్ధంగాఉన్నాను. మరొక హామీకూడా నేనిస్తున్నాను. నాకున్న దురభిప్రాయాల నాధారంగా తీసుకొని యేపనీ నే నింతవరకు చేయలేదు.నాదురభిప్రాయాలు ఖాయపడి, మీపార్టీ ఒక దుష్టశక్తి అనీ, స్వాతంత్ర్యసమరంలో నిజంగా అదొక ఆటంకమనీ, రుజువైనప్పుడే నేనలాచేస్తాను. నేవలాంటి అభిప్రాయానికి సులభంగారాను. వచ్చినట్లయితే, మీకుతెలియజేస్తాను. అలాంటి అభిప్రాయాన్ని తొలగించడానికి మీకు వ్యవధి చాలాయిస్తాను. మీవిలువ నాకుతెలుసు. శక్తిసామర్థ్యాలుగల యువకులు, యువతులు మీలో వున్నారు. వాళ్లో ఎంత స్వార్థత్యాగం ఉందని నేననుకొంటున్నానో, అంతా వారిలో ఉంది. మీరంతా కష్టపడి పనిచేస్తారు. మీశక్తి గొప్పది. మీప్రచారకుల్లోమీద మీరు కఠినమైనశిక్షణ అమలు పరుస్తారు. వీటన్నింటి విలువ ఎంతో నాకు బాగా తెలుసు.

అందుకు మిమ్మల్ని ప్రశంసిస్తున్నాను. అలాంటి వారిని, నాలోగల ఆపో హలకొద్దీ, సులభంగా జార విడువను.

మీరు వెన్వెంటనే నాప్రశ్నలకు పంపిన జవాబుల్ని పరిశీలించడంలో యింత ఆలస్యం కావడానికి కారణం, యితర విషయాల్లో నేను నిమగ్నం కావడమే. ఇది మీకు కూడా తెలుసు. మరొక కారణం ఏమంటే, మీపార్టీని గురించి వ్యతిరేకంగా అడక్కుండా వచ్చిన రిపోర్టులు ఎన్నో ఉన్నాయి. వాటిని పరిశీలిస్తూ కాలం గడుపుతున్నాను. వారివారి పేర్లను ఉపయోగించుకునే అధికారం నాకీయమని కోరాను. అందుకు వారంగీ రించారు. అన్నిటికంటె ఆఖర్ని వచ్చిన రిపోర్టు మొదట తీసుకుంటాను. బాబు మనోరంజన్ చౌదరి దాన్ని నాకిచ్చాడు. నావద్దకు మనోరంజన్ చౌదరి వస్తున్నాడనికూడా నాకు తెలియదు. సంభాషణకు టైము నిర్ణ యించమని ఆయన నన్ను కోరినప్పుడు, రాజాజీ ప్రణాళికను నేను అంగీక రించడాన్ని గురించి చర్చించడానికేనని చెప్పాడు. కాని, తన కాలంలో యెక్కువభాగం కమ్యూనిస్టులు జాతీయోద్యమానికి ఎంత యెక్కువ హాని కలిగించారో చెప్పడానికే వినియోగించాడు. ఈమాట ఆయనది కాదు: ఆయన ఉపయోగించినమాటకంటె మెత్తని మాట ఉపయోగిస్తున్నాను. కొన్ని కాగితాలు నాయెదుట పెట్టి ఆయన తిరిగి వెళ్ళాడు. వాటిని నేను చదవలేక పోయాను. ఒక అచ్చుపుస్తకం కూడా ఆయన నాకిచ్చాడు. అక్కడక్కడ దాన్ని చదివితే, చాలా పాడుగా కనపడింది. మీరు ఎవరి నైనా నావద్దకు పంపి, ఆపుస్తకం తెప్పించుకోవచ్చును. బహుశా మీరు కూడా దాన్ని చూచియుండవచ్చు.

రెండవది, శ్రీయుత కాశేశ్వరరావుగారి (బెజవాడ) విషయం. కాశేశ్వరరావుగారుకూడా నాకొక దీర్ఘమైన జాబురాశారు. అందులో ఒక భాగాన్ని మీకు యిందుతో జతపరచి, పంపుతున్నాను. ఇంతేకాదు, మీ పార్టీని నిందిస్తూ చాలామంది నాకు ఉత్తరాలు రాస్తున్నారు. వారిలో నేనె రిగున్నవారూ ఉన్నారు: ఎరగనివారూఉన్నారు. శ్రీ జయప్రకాశనారాయణ గారి భ్రమలు తొలగిపోయినట్లు కూడా నేను వింటున్నాను.

మీపార్టీని గురించి మియాన్ ఇఫ్తికారుద్దీన్‌నీ, షౌకత్ అన్సారీనీ, అడిగి తెలుసుకోవలసిందిగా మీరు నాకు రాశారు. వారిద్దరినీ నేను బాగా యెరుగుదును. వారంటే నాకు చాలా గౌరవం. దురదృష్టవశాత్తు, ఇఫ్తి

కారుద్దీన్ జైల్లోఉన్నారు. కమ్యూనిజాన్ని గురించి నేను షౌకత్‌అన్సారీతో చర్చించలేదు. ఎందుకంటే, షౌకత్ అన్సారీని, ఆయన భార్య జొహరాని, వారి రాజకీయాలెలాంటివైనా, నేను బాగా యెరుగుదును. వారిద్దరూ నా కెన్ని హామీలు యిచ్చినా, నావద్దవున్న సాక్ష్యాన్ని తుడిచిపెట్టలేవు. ఆసాక్ష్యంఅంతా నేను కోరకుండా నాదగ్గరకు చేరినది. దాని సారాంశాన్ని నేను మీకిదివరకే తెలియజేశాను. మీమీద గల దురభిప్రాయం కొద్దీ దాన్ని పంపుతున్నానని భావించి తోసిపుచ్చవద్దు. మీ విమర్శకు లెంత అజ్ఞాను లైనప్పటికీ, వారి యెడల మీరు క్రోధభావం పెట్టుకోవద్దు. వారి విమర్శ నలు దురుద్దేశంతో కూడుకొనియున్నా, విరోధభావంతో చేసినవైనా, మీకు కోపం రావడం సహజం. చివరి విషయం: దేశంయొక్క స్వాతంత్ర్యం కోసం నేను తయారుచేసిన కార్యక్రమాన్ని అమలు జరపడంలో మీ అందరి సహకారాన్ని నేనుపొందగోరుతున్నాను. నేనుతప్పుడు మార్గమవ లంబిస్తున్నానని, మీదే సరియైన మార్గమని, నన్ను మీరు ఒప్పించగలిగి నట్లయితే, మీ పక్షంలోచేరి, సంతోషపూర్వకంగాను, నిష్కపటంగాను, పనిచేస్తాను. మీపార్టీలో సభ్యుడుగా చేరేందుకు తరిఫీదు పొందుతాను.

ఇట్లు మీభవదీయుడు,

(సం) ఎం. కె. గాంధి

(కాశేశ్వరరావు ఉత్తరం నకలు)

"కమ్యూన్‌లో (కమ్యూన్ అంటే, అంతా కలసి భోజనాలుచేసే స్థలం — సం.) వారు కొన్ని నాటకాలాడే వారు; ప్రతినాటకంలోను తుపాకికాల్పులు, ఉరితీయడం, రక్తపాతంతో కూడుకున్న హత్యలు — కథావస్తువులుగా ఉండేవి. విద్యార్థిసభ్యుల చేతులకు ఎర్రరంగుపూసి, వారి చేత ఉరితీయించడం, హత్యలు చేయించడం జరుగుతూ ఉండేది. ప్రతిరోజూ కమ్యూన్‌లో మాంసం వండించేవారు. ప్రతిసభ్యుడూ సహపంక్తిలో కూర్చొని భోజనంచెయ్యాలి. వంశ పారంపర్యంగా శాకాహారం చేసేవారు (ఉదాహరణకు

(బ్రాహ్మణులు, వైశ్యులు), విద్యార్థులు, మాంసం తినడమెలాగో పనిగట్టుకుని నేర్పేవారు. ఎందుకంటే దౌర్జన్య చర్యలపట్ల అసహ్యభావం పోగొట్టడానికి. గాంధీ అహింసా పద్ధతులంటే పట్టుదల వహిస్తున్నాడుగనక తాను మాంసం తినడం మొదలుపెట్టినట్లు నాతో ఒక బ్రాహ్మణ ఎం. ఏ. చెప్పాడు. 20 సంవత్సరాలుగా ఖద్దరుధరిస్తున్న ఒక వైశ్య బి. ఎస్. సి. తాను ఆ పాడుఖద్దరునుంచి బయటపడి స్వేచ్ఛననుభవిస్తున్నట్లుచెప్పాడు. అందరూ మాంసంతిని తీరాలని ఉత్సాహంగా వాదించేవాడు. అక్కడ వీరొక ఆవరణలో అధ్యయనతరగతులు నడిపేవారు. వీరంతా గాంధీకి, సత్య, అహింసలకు, కాంగ్రెసు నాయకత్వానికీ, దేవునికీ, ఖద్దరుకీ, గ్రామపరిశ్రమలకు, పూర్తిగా వ్యతిరేకం. స్త్రీ-పురుష సంబంధాలలో విచ్చలవిడి, స్వేచ్ఛాప్రవర్తన మంచిదని వారు ఉపన్యాసాలిచ్చేవారు. ఒక సమావేశంలో వారి నాయకుల్లో ఒకడు, గాంధీజీ ఇండియాకు దాపురించిన 'రస్పుటీన్' అని ప్రకటించాడు. (రష్యాలో విప్లవానికి పూర్వం జార్‌చక్రవర్తి ఆస్థానంలో రస్పుటీన్ అనే దొంగసన్యాసి ఒకడుండేవాడు. వానికి జార్‌చక్రవర్తి భార్యతో సంబంధం ఉండేదని ప్రతీతి. రాజకీయాల్లోకూడా రస్పుటీన్ చాలా ప్రముఖపాత్ర వహించేవాడు. ప్రజలమీదజరిగిన అనేక అత్యాచారాల్లో వీనికికూడా కొంత భాగం ఉంది. సం.) ....వారంతాకలిసి ఎంగెల్సు రచించిన ఒక పుస్తకం చదువుతూ ఉండేవారు. ఆ పుస్తకంలో ఉమ్మడి పెండ్లిండ్లు లేక జంటవివాహాలు మంచివనిరాశాడు (అనగా ఇద్దరుభర్తలు ఉమ్మడిగా యిద్దరుభార్యల్ని కలిసి అనుభవించడం) ఏకపత్నీవ్రతం స్త్రీల స్వాతంత్ర్యాన్ని హరించడానికి బూర్జువావర్గం కల్పించిన

కృత్రిమపద్ధతిగా ఆ పుస్తకంలో ఎంగెల్సు చిత్రించాడు; ఆ విధానాన్ని ఖండించాడు."........ "వారు సామాన్య కాంగ్రెసువాదుల్ని, ముఖ్యంగా తమకుపోటీగా పనిచేస్తున్నారనుకునే విద్యార్థి వర్కర్లను, రైతువర్కర్లను, యువజన వర్కర్లను పోలీసులకు వొప్పజెప్పించడంలో సి. ఐ. డి. లుగా పనిచేశారు. తమ వ్యతిరేకుల్ని అణచడానికి కఱ్ఱలుపయోగించి కొట్టవలసిందని రహస్యంగా వారి నాయకుడు ఉత్తరువులు పంపించాడు. దీనితోబాటు, దొంగ భోగట్టా యిచ్చి వారిని పోలీసులకు వప్పజెప్పమనికూడా ఆ ఉత్తరువులలో ఉంది."

VI

గాంధిజీకి పి. సి. జోషీ వ్రాసిన లేఖ

బొంబాయి, 16-8-44

ప్రియమైన గాంధీజీ,

మీరు జులై 30 వ తేదీన వ్రాసిన లేఖకు సజ్జాద్ జహీర్‌ద్వారా సమాధానం పంపుదామని అనుకున్నాను. కావి శుక్రవారం బయలుదేరడానికి బదులు ఆయన ఈరోజునే బయలుదేరుచున్నాడు. నేను 'పీపుల్సు వార్'కు వ్యాసంవ్రాస్తూ పనిలో మునిగియున్నాను. నా వ్యాసంఉన్న "పీపుల్సువార్" అడ్వాన్సుకాపీ ఒకటి పంపుచున్నాను. మీరు జహీర్‌ను కలుసుకుని మాట్లాడేముందు నా వ్యాసం చదువమని కోరుతున్నాను. బెంగాలు, పంజాబుకు సంబంధించిన లెక్కలుకూడా కొన్ని పంపుతున్నాను. అవి మీకు ఉపయోగపడతాయని తలుస్తాను.

మీరు 19 వ తారీఖున బొంబాయి వస్తున్నారు కాబట్టి అప్పుడే మీ వుత్తరానికి సమాధానం పంపుతాను.

వినయపూర్వకమైన అభివందనములతో
పి. సి. జోషి

VII
గాంధీగారికి జోషీ వ్రాసిన లేఖ

బొంబాయి, 12 సెప్టెంబరు 1944

ప్రియమైన గాంధీజీ,

మీరు జులై 30 వ తేదీన వ్రాసిన ఉత్తరం హాతీసింగ్‌గారిద్వారా సకాలంలో అందచేయబడింది. ఇది అందిన రెండురోజులలోనే 'క్రాన్జీ ద్వారకదాసు'గారితో ఏదో మాటలసందర్భాన ఒకవిషయం తెలియవచ్చింది. కార్మిక సమస్యల వ్యవహారంలో మాలో ఒకరు ఆయనతో టెలిఫోనులో మాట్లాడే సందర్భాన, ఆయన ఒకవిషయం తెలియజెప్పారు. మీరు మాకు వ్రాసిన రెండవ లేఖచేరి వుంటుందని, ఆర్థిక విషయమై మేము ఇచ్చిన సంజాయిషీకి మీరు తృప్తిపడ్డారుకాని, మానైతికప్రవర్తనను గురించి మీరు విచారణ చేస్తున్నారని ఆయన అభిప్రాయ పడుతున్నాడు. కాంజీని గురించి మీకు బాగానే తెలుసునను కొంటున్నాను. మన ఉత్తరప్రత్యుత్తరాల విషయంలో, మీకార్యదర్శులు ప్రవర్తించుతున్న విధం మాకు అసంతృప్తికరంగా వున్నది. అనేక పత్రికలలో, మీప్రశ్నల సారాంశంపడింది; కాని మాజవాబులు పడలేదు. ఆవిధంగా కొద్దికొద్దిగా ఈవిషయాన్ని జారవిడుచుతున్నాయి. మేం పత్రికలకు ఏమాత్రం పొక్కనీయలేదు. ప్రజాఉద్యమ జీవితంలో సాధారణంగా ఒకసాంప్రదాయము,సభ్యతా ఉంటాయి. ఇతర దేశాల ఉద్యమ జీవితాలకంటె, మన జాతీయోద్యమంలో మరింత సత్సంప్రదాయము, సభ్యతా, కలిగివున్నామని మనం గర్విస్తూ ఉంటాం. పైవిధంగా పొక్కడం మాకెంతో కష్టం కలిగించుటేగాక, జాతీయ సాంప్రదాయానికి చెడ్డపేరు తెస్తున్నది. మీమూర్తి ప్రతిబింబమైన జాతీయోద్యమానికే కళంకం వస్తున్నది. కాబట్టి ఈవిషయం చెబుతున్నాను.

మీరు వ్రాసిన వుత్తరం అంతాతీసుకుంటే, దానిపై మాకుకల్గిన అభిప్రాయాలను(రియాక్షన్) మొట్టమొదటనే తెలిపివుండే వాడినే. మీరు వ్రాసిన విధంగా నాతండ్రియే నాకు జాబు వ్రాసినట్లయితే, ఆయన ఉత్తరానికి జవాబు వ్రాసిఉండేవాణ్ణికాదు; ఆయన ముఖం తిరిగి ఎన్నడూ చూచియుండేవాణ్ణి కాదు. కాని నేను మీకు ఎందుకు వ్రాస్తున్నావంటే, మీరు దేశానికే తండ్రి వంటివారు-మీరు మమ్ము అవమానపరచి కొంచెపరచినా మీపై కోపం తెచ్చుకోడం నాదేశభక్తియుతమైన కర్తవ్యం కాదు. అవన్నీ మీరు నమ్ముతు

న్నారని అనుకోను. కాని, మాదృక్పథాన్ని గురించి మీకుఏమాత్రం తెలియదనీ, మీకు మాపార్టీపై బలమైన దురభిప్రాయలున్నాయని, ఈఒక్క విషయంవల్లనే తెలుస్తుంది. మీరు వ్రాస్తున్న దేమిటో కూడా మీరు గ్రహించలేనంత స్థితికి పోయారు. మీరు నాకు వ్రాసిన లేఖల నమూనాలను భూలాభాయిదేశాయి, రాజగోపాలాచారి, సరోజినీనాయుడుగార్లకు ఇవ్వండి. మీఉత్తరం చూచి నేనింతగా ఉద్రిక్తుణ్ణి కావడం సహజమేనని వారుకూడా నాతో ఏకీభవింపుతారని అనుకొంటాను.

మాపాలసీ ప్రభుత్వానుకూలమైనదని మీ లేఖలో వ్రాశారు. ఆ భాగాన్ని గురించి నేనిచ్చట చర్చించను. ఈపాయింటుమీద ఉత్తరాల ద్వారా మిమ్మల్ని ఒప్పించగలనని నేననుకోను. మాపై దురభిప్రాయాలకు మూలం మాపాలసీ కాదని మీరే అంటున్నారు.

దురభిప్రాయాలు గాఢంగా నాటుకున్నంతవరకు మనం రాజకీయ సమస్యలను చర్చించలేము.

ఢిల్లీలో ప్రభుత్వ రికార్డులు ప్రస్తుతం మేము అవలంబించే రాజకీయ పాలసీనిగురించి ప్రభుత్వం అనుకొంటున్నదేమిటో తెలియజేస్తాయి. కాని ఢిల్లీ మనచేతిలో పడేరోజువరకు నేను వేచియుండడంలేదు।

చాలా పత్రికలకు, ఇటీవల పూర్వపు తీవ్రనియమాలను కొంత సడలించి, పేపర్‌కోటా కొంత హెచ్చించారు. మేముకూడా ప్రభుత్వానికి అప్లికేషన్ పంపాము. చాలా "జాతీయ" పత్రికలకిచ్చిన కోటా మాపత్రికలకు, ప్రచురణ కార్యాలయాలకు ఈయలేదు దీనికి సంబంధించిన ప్రభుత్వంతోటి ఉత్తర ప్రత్యుత్తరాలను మీకు పంపుతున్నాను. "'ప్రజాయుద్ధం' అనేది చాలా సంశయానికి దారితీస్తుందనీ, ఒక ప్రజాపార్టీ అయినా కనీసం 'ప్రజాయుద్ధం' అని అంటోందని ప్రభుత్వం ప్రచారం చేసికొంటుందనీ" మీరు భయపడుతున్నారుగదా। దానికి జవాబు పై ఉత్తర ప్రత్యుత్తరాలే సూచించుతాయి. మీకుగల దురభిప్రాయాలు తొలగిపోయినపుడు-మీరు ఎంత చిత్తశుద్ధి కలవారమని చెప్పుకొంటున్నారో అలాగే మేమూ చిత్తశుద్ధిగలవారమని మీరు మమ్మల్ని తలచినపుడు — ఆనాడు మీతో నేను రాజకీయసమస్యల గురించి చర్చించుతాను.

మేమంటే మీరింత ప్రతికూలంగా ఎందుకుండవలసి వచ్చిందో, ఆ కారణాన్ని గురించి మేము దీర్ఘంగా ఆలోచించాము. కమ్యూనిజాన్ని

మీరు తప్పుగా అర్ధంచేసికోవడమే మీ వ్యతిరేకతకు మూలకారణం. మీరు ప్రధానంగా మతాభిమానులు. మీకొక నైతికనియమావళివుంది. మీ ప్రధాన మత నమ్మకాలను మీ రాజకీయ కార్యకలాపంతో మేళవించుతూవుంటారు మీరు. కమ్యూనిజంఅంటే "ఎట్టి సాధనోపాయాల చేతనైనాసరే ఆశయాన్ని నెరవేర్చుకోవడమే"ననీ; అందుచే తమ ఆశయం నెరవేరుతుందనుకొనే పక్షంలో కమ్యూనిస్టులు ఎట్టి అపర్చ్యూనిస్టు పాలసీలనైనా అవలంబించుతారనీ, ఎట్టి తుచ్ఛమైన ట్రిక్కులనైనా చేయగల సమర్థులనీ, మీఊహ. కమ్యూనిస్టు సిద్ధాంతాలను యిలా అపార్థం చేసికోడంవల్లనే మాపై యితరులువేసే ఎట్టి నిందలనైనా వినడానికి చెవులొగ్గుతున్నారు.

ఇంతకూ ఈ నిందలు బూజుపట్టిపోయినవి. 1920–30 తర్వాత యూరప్‌లోని విద్యాధికులు నిందలువేయడం మానివేశారు. 10 ఏండ్ల క్రితం ఈనిందలు అపుడప్పుడు వినేవాణ్ణి. కాని ఇప్పుడు వందలకొలది మేధావులను, కమ్యూనిస్టులుకాని ఇతర దేశభక్తులను కలిసికొన్నాను. కాని ఈ ప్రసక్తే లేదిప్పుడు.

నేను చెప్పేదలా వదలివేయండి. నైతికదృక్పథంనుండే కమ్యూనిజాన్ని అర్థం చేసుకోడానికి మీరు కొంతకాలాన్ని వినియోగించండని కోరుతున్నాను. మీరు 'డీన్ ఆఫ్ కాంటర్‌బరీ'ని ఎరిగియేవున్నారు; మీరాయన ఇంట నివసించారుకూడ. ఆయన మీకూ మాకూ గూడ స్నేహితుడు. ఆయన గాఢమైన మతాభిమాని. స్నేహితుడవడానికికూడ అతని మత నమ్మకాలే తోడ్పడ్డాయి. ఆయనేమీ మా పార్టీసభ్యుడు కాదు. కాని గట్టి సానుభూతిపరుడు. బ్రిటిషు కమ్యూనిస్టులపత్రికయైన "డైలీవర్కర్" సంపాదకవర్గంలో అతడొకడు. ఆయన మతదృష్ట్యా, నైతికదృష్ట్యా అనేక సమస్యలపై వ్యాసాలు వ్రాశాడు. "సోషలిస్టు సిక్స్త్ ఆఫ్ ది వరల్డ్" (ప్రపంచంలో ఆరవభాగమయిన సోవియటు యూనియన్) అనే పుస్తకమూ, "మార్క్సిజం అండ్ ఇండివిడ్యులిజం" (మార్క్సిజమూ, వ్యక్తిత్వమూ) అనే కరపత్రమూ ("ది హెరిటేజ్ వుయ్ ఎక్లయిమ్" అన్న పుస్తకంలో రెండవ భాగంగా దీనిని ప్రచురించారు ఇండియాలో) మీరు చదువవలసిందని గాఢంగా కోరుతున్నాను. అది చదివితే కమ్యూనిస్టులమైన మేమే నిజంగా, (మతంలో నమ్మకంలేదని మేం చెప్పుకొన్నప్పటికీ) నిజమైన "మతం" (నీతి నియమాలు) గలవారమని

మీకు బోధపడుతుంది. మతాలు బోధించే నీతి నియమాలకు మేం కట్టుబడి వుంటాం. సాధారణంగా ఆ మతాలను అనుసరించేవారు వాటిని ఆచరణలో పెట్టరు. ఇంతేగాదు, మా నీతినియమాలు చాల కఠినంగా ఉంటాయి. కమ్యూనిస్టులు వ్యక్తిగతంగా ఎంతో త్యాగాలు కావించవలసియుంటుంది; జీవితంపొడుగునా ఆత్మవిమర్శతో విజ్ఞానం పొందవలసివుంటుంది; ప్రజలకు సేవజేస్తూ నిత్యజీవితంలో చాల కఠినమైన బాధలకు గురికావలసి వస్తుంది.

డీన్‌వ్రాసిన వ్రాతలు మీకెలా ఉన్నాయో, ఆయనవ్రాతలు మమ్మల్ని సరిగా అర్థంచేసుకోడానికి మీ కుపకరించాయో లేవో తెలిసికోడానికి మీనుండి జవాబు అపేక్షించుతాను. నేను రికమెండుచేసినవాటిని చదువుతానని మీరు దయతో వాగ్దానంచేశారు. మీకు ప్రతివారం మా పత్రిక పంపుతాము. ప్రతివారం ఒకసారి దాన్నికాస్త పరిశీలించి, అభ్యంతరకరమైన దేదైనా మీకంటబడుతుందేమో చెప్పండి. 3 నెలలు చదివిన తర్వాత కూడ మేము దేశభక్తులంకామని, మా తలలో ఒక నిశ్చితాభిప్రాయాలు లేవని ఇంకా తలుస్తారేమో, నాకు వ్రాయండి. మాపత్రికలో ప్రభుత్వానికి సహాయపడేది, ప్రజలను దెబ్బకొట్టేది ఏదైనా ఒక్కపేరా ఉందేమో చూపించండి.

మా ఆర్థికవిషయాలను గురించి నేనిచ్చిన సమాధానం అంగీకరించి మీరు "పూర్తిగా సంతృప్తిపడి"నట్లు తేలుతున్నది. ఇతర విషయాలకు కూడ నేను సూటిగా సమాధానం ఇచ్చాను. డాక్యుమెంట్లుకూడ పంపాను. కాని మీరు "సూటిగా జవాబీయలేను" అని ఇంకా భావించుతున్నారు. మీరు నా జవాబులను హర్షించుతున్నామన్నారు. కాని, "దురభిప్రాయాలతో ఉండియుండకపోతే మీ సమాధానాలను ఒప్పుకొని యుండేవాడిని." అని మీరు వ్రాశారు. ఒక యువక దేశభక్తియుత పార్టీపై వేయబడిన నిందలను పరీక్షించడానికి, దురభిప్రాయాలు అడ్డువస్తున్నాయని మనదేశ నాయకుడు అంటున్నాడంటే, అది మీరూహించలేనంతగా మమ్మల్ని బాధించుతోంది.

ప్రజలలో విశ్వాసం కోల్పోయి, నైతికగుణాలన్నీ పోగొట్టుకొన్నవారు, ఎదటి రాజకీయపక్షాలమీద ఇంత బురదచిమ్మడం ఒక ఆయుధంగా ఎంచుతారు. ఉదాహరణకు నిరంకుశ ప్రభుత్వం మీ చిత్తశుద్ధినే శంకించి

మీరు జపాను అనుకూలురని ప్రచారంచేస్తూ, ఆ ఆయుధాన్ని ఉపయోగించింది. కొందరు కాంగ్రెసు సోషలిస్టులు, బోసుముఠావాళ్లు మాపై అదే ఆయుధాన్ని ఉపయోగించుతున్నారు. ఈ పార్టీలవాళ్ళే. బుద్ధిపూర్వకంగా మాపై నిందలువేస్తూ మీకు ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఈనాడు మీకు వినిపించుతున్న నిందలనే, స్థానికంగా ప్రచారంచేసి విఫలులయ్యారు. మీరు విడుదలయాక, మీకు మాయెడల దురభిప్రాయం కలుగచేయాలని చూస్తున్నారు.

ఈ విషయంలో, కొందరు మంచి కాంగ్రెసువారు—మాపై దురభిప్రాయపడిన కారణంగా — వీరికి సహాయపడుతున్నారు. కొంతమంది చిత్తశుద్ధిగల కాంగ్రెసువాదులే ఎందుచే అంత తీవ్రంగా కమ్యూనిస్టు వ్యతిరేకభావాలను కల్గియున్నారని మీరు ఆశ్చర్యపడుతున్నట్లు తోస్తుంది. కారణం సువిదితమే. ఆగస్టు 9 నుండి మేము నమ్మినపంథాను అనుసరించి గట్టిగా నిలబడి పనిచేశాం. విధ్వంసకచర్యలలో పాల్గొన విరాకరించాం. ఈచర్యలు మనదేశ క్షేమానికి విరుద్ధమని మేం నమ్మాం. కాంగ్రెసువాదులలో కొందరు, ఇది కాంగ్రెసుకు వ్యతిరేకమనీ, దేశానికి విరుద్ధమనీ ప్రచారంచేయసాగారు. కాని తర్వాతి ఘటనలు మాదే సరియైన పంథాయని ఋజువుచేశాయి. మాపై వారికిగల వ్యక్తిగతక్రోధము, రాజకీయ అసహనము, తమతో ఏకీభవించని వారికి సైతం దేశభక్తి ఉంటుందని అనుకోకపోవడము, వారిని కాంగ్రెసు సోషలిస్టుల వలలో పడేటట్లు చేశాయి. ఒక్కొక్కప్పుడు పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉంటుందంటే- కాంగ్రెసువారు జపానుఅనుకూలురుకాదని ఒకప్రక్క మేము వాదించుతూ ఉంటాం, మరోప్రక్క ఆకాంగ్రెసువాదులే మమ్మల్ని ప్రజాశత్రువులంటూ ప్రచారం చేస్తున్నారు.

రాజకీయ అసహనం కాంగ్రెసు అనుయాయులలో ఎంతవుందో ఒక ఉదహరణ చూపుతాను. కాంగ్రెసు అనుయాయులలో మధ్యరకం వారు చాలమంది ఈనాటికి కూడా 'జిన్నా ప్రభుత్వపు ఏజంటే'నని నమ్ముతున్నారు. జిన్నాతో మీరు రాయబారాలు జరపడంలో మీకెవరో దుర్బోధ చేశారనే వారి నమ్మకం. లీగులో కూడ దేశభక్తులున్నారంటే వారి జీవితంలో వారు నమ్మరు. ఇలాంటి గ్రుడ్డి దురభిప్రాయాలే మావల్ల కూడా వారికి ఉన్నాయి. కలిసి పనిచేసిన కొలదీ. చిత్తశుద్ధి గల కాంగ్రెసువారందరి విశ్వాసాన్ని మేం పొందగలమని విశ్వసిస్తున్నాం. జీవితంలో క్రమ

ముగా వారే దురభిప్రాయాలకు తావుండరాదని గ్రహించుతారను కొంటాను.

మీకు వ్రాసిన వ్యక్తుల విషయం మీరువిచారించే పక్షంలో ఈక్రింది సంగతి స్పష్టంగా తేలిపోతుంది. ఆగస్టు విధ్వంసక చర్యలను ఆర్గనైజ్ చేసిన వారూ, సపోర్టు చేసినవారూ అయివుంటారు. లేదా వీరి దుర్బోధలకు లోనయి మాపై గాఢమైన దురభిప్రాయాలు కలిగినవారై వుంటారు.

వారికి మామీద ఇంత తీవ్రద్వేషం దేనికి? మేం విధ్వంసక చర్యలను వ్యతిరేకించాము. వారి రంగును వుత్త మాటల్లోనేగాక, క్రియారూపకంలో బయటపెట్టాం. ఇవే మాపై వారి ద్వేషానికి కారణాలు.

జైలునుండి మీరు వ్రాసిన లేఖలు బయటపడ్డాక, తర్వాత మీరు ఇచ్చిన ప్రకటనలు చూచాక, వాళ్ళు రాజకీయంగా మమ్మల్ని ఎదుర్కోలేక పోయారు. అందుచే ఈతుచ్ఛపు పనులకు దిగారు.

దేశభక్తుడు అని ప్రతివారు చెప్పుకొనే వ్యక్తి ఎవడూ కూడా మీ చెవులలో ఊదిన నిందలను, నా ముఖాన చెప్పడానికి సాహసించిన వ్యక్తి- ఇంతవరకు కన్పించలేదు. తమతమ జిల్లాలలో కాంగ్రెసు-లీగుల నాయకులముందు ఆ నిందలను తిరిగి చెప్ప సాహసించినవాడు నాకు కన్పించలేదు.

మీకెంతో "సాక్ష్యం" చూపించామని చెప్పుకొన్న వ్యక్తులకు (ఆ "సాక్ష్యం" అంతా వుత్తనిందలని నేనంటాను.) మీరీ క్రింది విధంగా జవాబు ఇస్తారని ఆశించుతాను. కమ్యూనిస్టులపై తాము చెప్పేదంతా నిజమైతే, ఆ యా జిల్లాలలో కమ్యూనిస్టులను తుడిచిపెట్టడం వాళ్ళకి సులభమైన విషయమే గదా! వాళ్ల రిపోర్టులప్రకారం, కమ్యూనిస్టులు దేశభక్తిలేని, నీతినియమాలులేని గ్యాంగుకదా! అలాంటివాళ్లను ప్రజలనుండి వారెందుకు దూరం చేయగూడదు? ఈ విషయం మీరు వారి నడిగివుంటారని ఆశించాను. ఒకదేశానికి తండ్రివంటివాడు, దేశమనే పెద్దకుటుంబం నిర్వహించవలసినవాడు, ఆరీతిగా ప్రశ్నించి యుండవలసిందని భావించుతాను.

మీరు రెండు విషయాలు నాముందు పెట్టారు. ఒక్కొక్కటి తీసుకొంటాను.

1. మనోరంజనచౌదరి విషయం. ఇతను మిమ్మల్ని కలిసికొనేముందు నన్ను కలుసుకున్నాడు. నాభార్యకుబంధువైన మరొకరితో కలిసివచ్చాడు.

ఆబంధువు ఈ చౌదరికి పూర్వపు స్నేహితుడు. నేను బహుశా ఆయనను కలిసికోననే భయంతో వెయిటింగు రూమ్‌లో కూర్చున్నాడు. మాబంధువు ఈప్రసక్తి తేగానే, నేనతనినిపిలిచాను."బెంగాలీయులలోకల్లా మంచిపిల్లవి" పెళ్ళాడినందుకు నన్నభినందించాడు. నేను సిగ్గుపడ్డాను. అతని జిల్లాయైన 'నౌఖాలీ'లో మంచి వర్కర్లంతా మాపార్టీలోఉన్నారన్నాడు. ఇండియాలోకల్లా "మంచి ఆర్గనైజ్‌డ్ పార్టీ"ని నిర్మించినందుకు నన్నభినందించాడు. ఇలాగే ఎన్నో పొగడ్తలు. చివరకు. నా "శక్తివంతమైన వ్రాతలను" మెచ్చుకొంటాడటగాని, కొన్ని విషయాలలో అతడు నాతో ఏకీభవించనని చెప్పాడు. అదివరకు ఆయనను ఎరుగను. అందుచే మర్యాదగాను,సంతోషంగాను అతనితో మాట్లాడాను.

ఈ వ్యక్తియే, మీకు ముందుగా తెల్పకుండా కూడా మీవద్దకు వచ్చాడు. ఇతడు శ్యామప్రసాద్ ముఖర్జీకి దూత - స్కౌటు; కొరియరు కూడా.

రాజాజీ ప్రణాళిక (ఫార్మ్యులా)ను చర్చించడానికని అతడు మీదర్శనం కోరాడు. కాని, మేం "దేశక్షేమానికి చాలా హానికల్గించామని" పితూరీలు చెప్పడంతో "చాలా భాగం" మీ కాలం వ్యయపరిచాడు (శ్యాంప్రసాద్ మీతో మాట్లాడటానికి కావలసిన సన్నాహం చేస్తున్నాడతడు. దానితోపాటు, కమ్యూనిస్టులంటే మీ అభిప్రాయమేమిటో తట్టి చూద్దామని ఎత్తువేశాడు).

అతడు కొన్ని కాగితాలు మీకిచ్చాడని మీరు వాటిని చదవడానికి అవకాశం లేకపోయిందని వ్రాశారు.

మీకు ఒక అచ్చుపుస్తకం కూడా అతగాడిచ్చిపోయాడు. ఆ పుస్తకం పేరేమిటో మీరుదహరించలేదు. కాని, నేనూహించగలను. కల్యాణి భట్టాచార్య వ్రాసిన "ప్రజలపై యుద్ధ"మనే పుస్తకం అనుకొంటాను. నేనా పుస్తకం చదవలేదుగాని, అక్కడక్కడా తిరగేశాను. వ్యంగ్య చిత్రాలు చూశాను. నేనిది చూడగానే బెంగాల్ పార్టీ ఆఫీసుకు ఈ పుస్తకానికి సమాధానం "పీపుల్సువార్"లో ప్రకటించాలా? అని తంతినిచ్చాను. దాన్నిగురించి అంత శ్రమపడనవసరంలేదనీ, అది పంచడం మానివేశారనీ జవాబు వచ్చింది. ఎందువల్లనంటే, పరువు మర్యాదగల బెంగాలీయులంతా దానిని చదివాక అసహ్యించుకోసాగారు.

ఈపుస్తకంలోని విషయ మేమిటి? నేను మాక్సువెల్‌కు ఏజంటునట. బెంగాల్‌లోని మా స్త్రీ కామ్రేడ్సంతా వ్యభిచారిణులనేభావాన్ని వ్యక్తపరుస్తుంది ఈపుస్తకం. దానికి సాక్ష్యం ఏమిటి? ఏమీలేదు. కాని పుస్తకమంతా నాకూ, నాపార్టీకి, మాక్సువెల్ డబ్బువెల్లిస్తాడని నిందలుమోపాడు. దీనినే మాటల వర్ణనలతో పుస్తకంఅంతా నింపాడు."గవర్నమెంటు డబ్బుతింటున్న ఏజెంటు" అనే నింద విషయమై, మీరు చూడనే చూచారు. పోతే, మా ఆహార విధానం ప్రభుత్వానుకూలంగా ఉంటుందనే విషయం తర్వాత చర్చిస్తాను. ఇక ఈపుస్తకం చివరకు ప్రజలకిచ్చే సందేశం ఏమిటి?

తిండికోసం దోపిడీలు - "విప్లవం" (అరాజకం) వగైరా. బెంగాలులో జపాను ఏజంటు ఏమికోరుతున్నాడో అదే యీ పుస్తకంలో ప్రబోధించబడింది. తర్వాత ఈపుస్తకాన్ని ప్రభుత్వం నిషేధించింది. నాకు తెలిసినంతవరకు ఒక్క బెంగాలీ పత్రిక కూడా ఈనిషేధానికి అసమ్మతి తెలుపలేదు.

ఇక పుస్తకం వ్రాసిన వారిని గురించి. ఈపుస్తకాన్ని ఆమె స్వంతముగా వ్రాయలేదని తెలుసు. డాక్టర్ శ్యాంప్రసాద్ దానిని వ్రాయించి, ప్రచురణకయ్యే ఖర్చులిచ్చాడు.

ఇక పుస్తకంలోని విషయాలకు వద్దాం. బెంగాలు మొదటి క్షామాన్ని గురించి "పీపుల్సువార్"లో వరుసగా కొన్నివ్యాసాలు వ్రాశాను. అవి బెంగాల్‌లో తుపాను రేకెత్తించాయి. భూలాభాయిదేశాయి నా వ్యాసాలు చదివాక, మాకామ్రేడ్స్‌లో ఒకరితో తనకు బెంగాల్ క్షామచిత్రం ఇంత స్పష్టంగా ఇదివరకు ఎన్నడూ కన్పించలేదని చెప్పాడు. తర్వాత ఈ వ్యాసాలను ఒక కరపత్రంగా ప్రకటించాం. బాగా ఖర్చయినాయి. రెండు వారాలలో రెండు ముద్రణలు వేయవలసివచ్చింది. ఆ వ్యాసాలలో శ్యాంప్రసాద్ సంగతి నేను బయటపెట్టాను. అతనిపాలసీ తిండిదొంగల చేతిలోని మనిషి అవలంబించేది. ఇంకా ఆచరణలో అతడు కులమత తత్వాలను రెచ్చగొడుతున్నాడు. ఈ రెండు విషయాలను నేను ఆవ్యాసములో ఉదహరించాను. నా వ్యాసాలకు "సమాధానము"ట ఈ కళ్యాణి భట్టాచార్య వ్రాసిన కరపత్రం.

బెంగాల్ క్షామాన్ని గురించి, క్షామ ఫలితంగా ఏర్పడిన పరిస్థితులను గురించి, మీరు చదవడానికి అవకాశం వుందనుకోను. మీరు ప్రధానమైన రాజకీయ సమస్యలో నిమగ్నులయి ఉన్నారు. జిన్నాను కలుసుకోబోతున్నారు. మీ కలయిక జయప్రదమైతే, బెంగాల్‌కు మీరు మీ వంతుసేవ వేరే చేయనవసరంలేదు.

నేను మీకు నచ్చే ఉదాహరణ ఒకటి ఇస్తాను. బెంగాలులో సుప్రసిద్ధ ఆర్థిక ప్రవీణుని సహాయంతో నేను చాలావరకు లెక్కలను తీసికొన్నాను. తర్వాత ఆయన నా వ్యాసాలను చూశాడు. నా పరిశీలన (ఎనాలిసిస్) తో అతడేకీభవించాడు నేను రెండవసారి బెంగాల్ వెళ్లినపుడు ఆయన నన్ను ఆహ్వానించాడు కొన్నాళ్ళు తనతో ఉండమని. మేం మరింత స్నేహితులమయ్యాం. అతడు అఖండమేధావి., ఆయన కమ్యూనిస్టుకాడు. ఆయన బెంగాలీవాడు, దేశభక్తుడు, సైంటిస్టు, గణితశాస్త్ర ప్రవీణుడు (స్టాటిస్టిషియన్). కల్యాణి భట్టాచార్య వ్రాసిన కరపత్రం ఆయనకు పంపి అభిప్రాయమేమిటో తెలిసికొండి. అంతేగాదు, మేం "పీపుల్సువార్"లో బెంగాలు ఆహార సమస్యమీద వ్రాస్తున్న వాటిమీద ఆయన అభిప్రాయమేమిటో తెలిసికొండి. మీరు ఆయన జవాబులుచూచాక, నేనెందుకు ఆగ్రహంగా వున్నానో మీకర్థం కాగలదు.

మరచిపోయాను. ఆయనశిష్యులు, బంధువులు చాలామంది మాపార్టీలో వున్నారు. ఆయన, ఆయనభార్య మాపార్టీలో యువకులను, యువతులను అనేకమందిని ఎరుగుదురు. మీరు నాకువ్రాసిన రెండు ఉత్తరాలప్రతులను, నాజవాబులను, మనిషిద్వారా వారికి పంపండి. మీరు ఇతరుల దుర్బోధలకు అవకాశమిస్తున్నారని వారిద్దరూ అభిప్రాయపడతారని నాకు విశ్వాసముంది.

బెంగాలులో వివిధక్షేత్రాలలో పనిచేసే బెంగాలు సుపుత్రులను, పుత్రికలను ఎందరినో ఇలాంటివారిని ఉదహరించగలను. కాని వారంతా అనవసరం. ఒక్కరుచాలు మీరు విచారించడానికి.

డాక్టర్ శాంప్రసాద్ మీకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాడు. మేం మిమ్ములను సపోర్టు చేయడమేకాకుండా, కాంగ్రెసు వాదులలో శ్యాంప్రసాదును ఎదుర్కొని పోరాడటానికి విశ్వాసం, ధైర్యం పురిగొల్పుతున్నాం. అయినప్పటికి, మీరు డాక్టర్ శాంప్రసాద్, అతని అనుచరుల మాటలకు చెవియొగ్గుతున్నారు।

మీరు నాకంటె డాక్టర్ శ్యాంప్రసాద్‌నే ఎక్కువ నమ్మినట్లయితే, మాయిద్దరిని ప్రజలనిర్ణయానికి బద్ధులమయ్యేటట్లు పరీక్షకుపెట్టండి. నేను బెంగాలు వెళతాను. మేమిద్దరం మా మా పతాకాలకింద, మా మా రాజకీయ పాలసీల గురించిచెపుతూ, ప్రజానీకాన్ని సమీపించుతాము. ఆయన హిందూమహాసభద్వారా, నేను మాపార్టీద్వారా ఈ మీటింగులను సమావేశపరుస్తాం.

కలకత్తాలో అతని మీటింగుకు రెట్టింపు, ఇతరచోట్ల అతనిమీటింగుకు నాల్గు మొదలు పదిరెట్లు జనులు నా మీటింగులకు హాజరవుతారో లేదోచూడండి. నేను బెంగాలివాణ్ణికాదు। పైగా గొప్ప వుపన్యాసకుణ్ణికాదు: డాక్టర్ శాంప్రసాద్ చూద్దామా, గొప్పవాచాలుడు (డెమగాగ్). బెంగాల్ గ్రామాలలో ఆ ప్రజాసముదాయాలను - ఈ దురదృష్ట బెంగాలుకు మీరు వచ్చిననాడే ఇంత పెద్దపెద్ద జనసముదాయాలు సమావేశమవుతాయి - మీ ప్రతినిధులను చూడమనండి.

2. కాశేశ్వరరావు లేఖలోని భాగాలగురించి

మా పార్టీసభ్యుల వ్యక్తిగత జీవితాన్ని, రాజకీయ జీవితాన్ని కూడా సలహాలతో, విమర్శలతో దారిచూపుతూ, జీవితాన్ని అంతా సరిదిద్దే పార్టీ మాదొక్కటేనని మీరు తెలిసికోగోరుతున్నాను. వ్యభిచారం మొదలైన నైతికపతనానికి మాపార్టీలో ఒకటేశిక్షవుంది. అది అతనిని పార్టీలోనుండి వెళ్లగొట్టడమే. మీకు మరొక విషయం తెలియజేయగోరుతున్నాను. మా పార్టీలో వృద్ధ స్త్రీలు మొదలుకొని అవివాహితలవరకు, యావత్కాలం పనిచేసే స్త్రీ వర్కరులు మా పార్టీలో కాంగ్రెసులో ఎన్నడూలేనంత భాగం ఉన్నారు. అందుచే ఎవడైనా నిందలు మోపేవాడు నైతిక ప్రవర్తనను గురించి దుమ్మెత్తిపోస్తున్నపుడు, తమతల్లులనూ అక్కచెల్లెండ్రనూ గురించి, కమ్యూనిజాన్ని గురించి ఏ మాత్రం తెలిసిన వ్యక్తికైనా లేక భారతదేశంలో ఏప్రాంతాల్లోనైనా కమ్యూనిస్టులుచేస్తున్న పని చూసిన ఏ వ్యక్తికైనా చిత్తశుద్ధిగల ఏ వ్యక్తికి - ఆ లేఖచూపినా అందులోనివన్నీ శుద్ధఅబద్ధాలని వెంటనే చెబుతాడు.

రాజాజీ మాకమ్యూన్‌కి వచ్చాడు. మాతో భోంచేశాడు. ఆ సందర్భములో, హాస్యంగా నేనొకమాటన్నాను. గాంధీగారిని తిండివిషయంలో ఓడించడానికి ప్రయత్నిస్తున్నామని. మీ భోజనంకంటే మాదే సాత్వికంగా వుందని రాజాజీ అన్నాడు.

గెల్డరుకూడా మాతో శనివారాలలో భోంచేశాడు. వారంలో శనివారం నాడుమాత్రమే మాంసము వండుతారు. ఆరోజేగాక పూర్తిగా శాకాహారం వండే యితర రోజులలోకూడా అతడు మాతో భోంచేశాడు. గెల్డరుకు మీరంటే ఎంతోప్రీతి. మాతిండివిగురించి, మేంనివసించే విధానంగురించి, ఆయన్ని ఏదైనా మాటల సందర్భంలో అడిగిచూడండి.

సరోజినినాయుడు కవయిత్రి. మనసంస్కృతిని ఎక్కువగా ప్రేమించే వ్యక్తి. అమెకు మాకవి కామ్రేడ్స్‌ను గురించి తెలుసు. మా యువతులు, యువకులు పాడుతూ నృత్యాలుచేసినపుడు అమె చూచింది. మా సంస్కృతి ఎలాంటిదో, భారతదేశ సంస్కృతికి మేం ఎట్టి సహాయం చేస్తున్నామో, ఆమెను అడగండి.

మా సెంట్రల్ కల్చరల్ స్క్వాడ్ (కేంద్రవిజ్ఞానదళం) క్రొత్త ప్రోగ్రాములను తర్ఫీదు పొందుతోంది. మీరు బొంబాయిలో వున్నప్పుడు, ఎప్పుడైనాసరే హఠాత్తుగా మీరక్కడకురావచ్చు. వారిపాటలు, నృత్యాలు చూచాక మీహృదయం గర్వంతో వుప్పొంగి పోతుందని, వాత్సల్యముతో కౌగలించుకొంటారని, నాకు నమ్మకంవుంది. రిహార్సల్ ఉదయం 8 నుండి 12 వరకు సాయంత్రం 2 నుండి 7 గంటలవరకు ఉంటుంది.

మీ మీటింగుకోసం బొంబాయివచ్చిన విదేశ విలేఖరులందరూ, మా విజ్ఞాన దళాన్నిచూచి, భారతీయజానపద సంస్కృతినిగురించి తెలుసుకోవాలని కుతూహల పడుతున్నారు. వారిలో ఎవరయినా వార్తా వచ్చినపుడు వారు మావిజ్ఞానదళ ప్రదర్శనాళు, పాటలు ఎలాఉన్నాయో అడిగిచూడండి.

ఇదంతా ఎందుకు వ్రాయవలసి వచ్చిందంటే, కాశేశ్వరరావు మీకు ఉత్తరం వ్రాయడంద్వారా మాకెంతఅన్యాయంచేశాడో చూపడానికే.

మీరు లాయరుకూడాను. మాఆంధ్రపార్టీనాయకుడు సుందరయ్యను కాశేశ్వరరావును ఇద్దరిని మీ సముఖానికి పిలిపించండి. ఆ ఉత్తరాన్ని గురించి ఇద్దరితోను మాట్లాడండి. 15 నిమిషాలలో ఆంధ్రదేశానికి నిజ

మైన సుపుత్రుడెవడో, ఎవరుకాదో, ఎవరు సత్యవ్రతుడో, ఎవరుకాదో తెలిసిపోతుంది.

మీరంతకు మీరే ఒక నిర్ధారణకు రాలేని పక్షంలో, ఆంధ్ర ప్రజల ముందు ఒకసక్రమ విచారణకోర్టును "ఆర్గనైజ్" చేయండి. మీరు మా మీద దురభిప్రాయాలున్న వారినిగాక, నిష్పక్షపాతులైన ఏ రాజాజీనో, ఏ సరోజినినాయుడునో - గౌరవింపబడే జాతీయ నాయకులను - జడ్జీలుగా నియమించండి. నేను 50 వేలమంది ప్రజలను గ్యారంటీ చేస్తాను. అన్ని తరాలవారు, స్త్రీలు, పురుషులు పసిపిల్లలతోసహా వస్తారు. ఎట్టి అల్లరి, ఆగంలేకుండా క్రమశిక్షణతోవుండే బాధ్యతమాది. కాశేశ్వరరావును ప్రాసిక్యూటర్ ఉపన్యాసం యివ్వమనండి. అతని సాక్షుల్ని వేదికను ఎక్కమనండి. సుందరయ్యకు సాక్ష్యంకూడా అవసరంలేదు. సుందరయ్య ఒక ఉపన్యాసం మాత్రం యిస్తాడు. కాశేశ్వరరావును, సుందరయ్యను కన్న ఆంధ్రమాత సంతానమే 'జ్యూరీ'గా ఉంటుంది. ఆ ప్రజలేం నిర్ణయిస్తారో "జడ్జి" గారిని పరిశీలించి చెప్పమనండి.

అన్నిటికంటె మమ్మల్ని ఎక్కువ అతని లేఖలలో బాధించిన విషయం ఒకటివుంది. స్త్రీ, పురుష సంబంధమైన నైతిక ప్రవర్తన విషయంలో మమ్మల్ని శంకించే అతని వ్రాతలు. ఆవ్రాతలు మీరు మాకు పంపడం, మాకెంతో బాధకలిగించాయి.

నీచమైన బూతులు కూస్తుంటే సాధారణంగా ప్రతిమానవుడు ఎలా ఉద్రిక్తుడవుతాడో అలాగే మేమూ ఉద్రిక్తుల మవుతున్నాం.

కాశేశ్వరరావ స్టేటుమెంటుకు ఎంత విలువ ఇవ్వవచ్చునో, అతను వేసే నింద ఎంత నిర్లక్ష్యంగా వేస్తున్నాడో, అతను ఎంగెల్సు పుస్తకాన్ని పూర్తిగా వక్రభాష్యం చెప్పడంలోనే తేలుతుంది. ఎంగెల్సు వ్రాసిన "కుటుంబం, ఆస్తి, రాజ్యాంగం" అను పుస్తకం, మానవచరిత్రలో పెండ్లిండ్ల పరిణామం, ఆస్తి, రాజ్యాంగము ఎలా పెంపొందుతూవచ్చాయి అనేవి తెలుపు శాస్త్రీయ గ్రంధం. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని స్థాపించుటలో మార్క్సుకు సహచరుడయిన ఎంగెల్సు ఈ పుస్తకంలో చర్చించిన విషయం ఏమిటి? పెండ్లిండ్లు రానురాను ఏకపత్నీవివాహాలుగా (Monogamic) మారుతూవచ్చాయి. సమాజం పెంపొందినకొలదీ, అంతకుపూర్వపు పద్ధతులను విడనాడుతూ వచ్చాయి. ఈసందర్భంలోనే మానవసమాజం

శైశవావస్థలో ఉన్నరోజుల్లో ఒకతెగలోవుండే స్త్రీ-పురుషులుఅంతా భార్యాభర్తలుగా వుండేవారని (కమ్యూనిటీ మారేజస్) ఆ చరిత్రను ఇందులో తెలియజేశాడు. ఎంగెల్సు కమ్యూనిటీ పెండ్లిండ్లను సమర్థించాడనడం కన్న నీచాతినీచమయిన అబద్ధం ఇంకొకటి లేదు. ఈ అబద్ధానికి యిదే సాటిగాని మరొకటి లభించదు. ఇలా వక్రభాష్యం చెప్పడం మొదలెడితే, చారిత్రక పరిశోధనే అసంభవం. పైగా ఎంగెల్సు, మానవులపెండ్లి పరిణామంలో అభివృద్ధికరమైనదశ ఏకపత్నీ వివాహమని చెప్పాడు. కాశేశ్వరరావు వక్రభాష్యం శుద్ధఅబద్ధమని రుజువుచేయడానికి ఇదొకటేచాలు.

వేవెల్ మీ "మేధాసంపత్తి"ని, "అనుభవాన్ని", "సునిశితబుద్ధి"ని గురించి ప్రశంసించాడు. కాంగ్రెసు ప్రతినిధుల "శక్తి సామర్థ్యాలను, ఉదారబుద్ధినీ" గుర్తించానన్నాడు. "అయినపక్షంలో మమ్మల్నెందుకు నమ్మడంలేదు" అని మీరు చక్కని సమాధానం యిచ్చారు.

"మీ విలువ నాకు తెలుసు. మీలో చాలా శక్తి సామర్థ్యాలు కల్గిన యువతీ యువకులున్నారు. నేనెంత నిస్వార్థినని చెప్పుకొనే హక్కున్నదో అలాంటి హక్కుగల స్వార్థత్యాగులు ఎందరో మీలోవున్నారు. మీరంతా కష్టపడిపనిచేస్తారు, మీరెక్కువ ఓపికగలవారు. మీవర్కర్లపై కఠినమైన క్రమశిక్ష విధించుతారు. ఇదంతా నేను హర్షిస్తున్నాను. ప్రశంసిస్తున్నాను." అని మీరు నాకు వ్రాశారు. కాని వేవెల్ మిమ్మల్ని నమ్మనట్లుగానే మీరు నన్ను నమ్మడ లేదు. సభ్యతా ప్రపంచములో అందరూ యదార్థమని అంగీకరించే విషయాలలో సైతం మీరు నన్ను నమ్మడంలేదు.

వేవెలు మిమ్మల్ని, కాంగ్రెసును చూసినట్టే, మీరు నన్నూ, నాపార్టీని చూస్తుంటే, నేను లోలోపల ఎంత బాధపడుతున్నానో మీరు కొంచెం గ్రహించండి.

రెండవది. చరిత్రాత్మకమైన ఆగస్టు ఎ. ఐ. సి. సి. మీటింగులో కమ్యూనిస్టు ప్రతినిధులు చెప్పిన మాటలేమిటో మీరెప్పుడైనా తిరిగి జ్ఞాపకం తెచ్చుకొన్నారా? వారు మిమ్మల్ని ఏమిచేయమని అర్థించారు? సత్యాగ్రహభాగము (శాంక్షన్ క్లాజ్)ను తీసివేయమని కోరారు. దానిస్థానే స్వయంనిర్ణయహక్కును అంగీకరించి, తక్షణమే లీగుతో రాయబారాలు కొనసాగించమని ప్రార్థించారు. ఈనాడు మీరు చేసిందికూడా అంతే.

ఆనాడు కమ్యూనిస్టు ప్రతినిధులు ఏప్రమాదాలనుగురించి మిమ్మల్ని హెచ్చరించారో, మీరు అరెస్టుఅయ్యాక అవే జరిగాయి. వాళ్ళ ఉపన్యాసాలలో దేనిని హెచ్చరించారో, జైలులో కొంచెం అవకాశం దొరకగానే మీరు అచర్యలను ఖండించారు (బయటి ప్రజలకు మీ యీ భావాలు తెలియలేదు). జైలులోనుండి విధ్వంసక చర్యలు పనికిరావని మీరు నిరశించారు. మీ అనుచరులమని ప్రతిన తీసుకొన్నవారంతా తప్పటడుగులు వేసిన సమయంలో, మేము బయటవుండి విధ్వంసక చర్యలు పనికిరావని పోరాడాం. మీరు రాజాజీని, జిన్నాతో సంప్రదింపులు సాగించమని చెప్పారు. మీరు రాజాజీ ఫార్ములా అంగీకరించిన విషయం మాకు తెలియకుండానే, కాంగ్రెసువాదులు, లీగువారూ ఆత్మవిశ్వాసం కోల్పోయియున్న సమయంలో, మేము స్వయ నిర్ణయ హక్కును గురించీ, కాంగ్రెసు-లీగు ఒడంబడికను గురించీ, బాగా ప్రచారంచేశాము.

మీరు బొంబాయివస్తారని అనుకొంటున్నాం కాబట్టి నేని వుత్తరం ముందుగానే వ్రాయలేదు. ఇక్కడికి వచ్చిన తర్వాతకూడ ఈ ఉత్తరాన్ని వెంటనే పంపలేదు. జిన్నాతో ఒడంబడికకు మీ దృష్టినంతా కేంద్రీకరించవలసిన సమయంలో మీ కాలాన్ని వ్యయపరచదలచుకోలేదు. జిన్నాతో సంభాషణలు ముగిసే ఆఖరిరోజని ఇవాళ అంటున్నారు. అందుచే ఇవాళ ఈ జాబును పంపుతున్నాను.

ఈ ఉత్తరాన్ని మీకు బాగా సావకాశం వున్నప్పుడు చదవమని కోరుతున్నాను. మా చిత్తశుద్ధిని గురించిన విషయంమీద ఇదే నా ఆఖరి ఉత్తరం. మీరు పంపినది చదవడానికి చాల అవమానకరం (హ్యూమిలియేటింగ్)గా వుంది. మా హృదయాలను మీకు విప్పిచెప్పాక, యిలాంటి వానిని మేము సహించవలసిన కారణం కనపడదు.

మేం విచారణ పెట్టమనికోరతాం. మామూలు పరిస్థితులలో ఇలా సూచించడం మాపార్టీ ప్రతిష్టకు భంగకరమే. అయినా అంగీకరించుతాము. మీదగ్గరనున్న కమ్యూనిస్టు వ్యతిరేక ఫైలంతా, అందరికీ విశ్వాసపాత్రులయిన సుప్రసిద్ధ దేశభక్తులవద్ద ఉంచుదాం. ఉదా: సరోజిని, భూలాభాయి, రాజాజీ. వీరుముగ్గురు మీఅనుచరులు. వీరికి మాపై దురభిప్రాయములులేవు. నాకుకూడా ఆ వ్యతిరేక ఫైలు కాపీ ఒకటివ్వమనండి. ఏవిషయంమీద నన్ను జవాబు యివ్వమన్నా వారికి నేను జవాబుయిస్తాను. వారి నిర్ణయం

విన్నాక మీరు, కమ్యూనిస్టువ్యతిరేక ఫైళ్ళన్నీ మంటల్లోపడవేస్తారని నాకు నమ్మకముంది.

మిమ్మల్ని ఒప్పించడానికి ఇంతకంటె నేను చేయగలిగినదేమీలేదని, నాతో మీరేకీభవించుతారని, అనుకొంటున్నాను.

దీనికి జవాబు ఆశించుతాను. కాని మీరింకా తృప్తిపడకపోతే, కనీసం రాజకీయ కారణాలతో మామీద నిందలమోపేవాళ్ళు పంపే పిచ్చిపిచ్చి కథలను గురించి మాకువ్రాయకండి. ఏదైనా రాజకీయ సమస్య మీదగాని, లేక ప్రజలకేమైనా సేవచేసే విషయంలోగాని మా సహాయం కావలిసివస్తే వ్రాయండి.

మనదేశమునకు తండ్రివంటి వారైనమీరు మాయెడల నిర్వర్తించవలసిన విధిని నెరవేర్చడంలేదు. ఇలా నెరవేర్చనన్నాళ్ళు, దేశానికి బిడ్డలమైనమేము దేశానికి చేయవలసిన విధిని మరింతకష్టపడి నిర్వర్తించవూనుకుంటాం. ఒకనాటికి మీ ఆశీస్సులు మాకు రాకతప్పవు.

కమ్యూనిస్టు పార్టీలో వ్యక్తి ప్రాధాన్యత (కెపాసిటీ) అనేదిలేదు. నేను మీకు వ్రాసిన ఉత్తరాలన్నీ మా పార్టీ నాయకత్వం తరపున వ్రాస్తున్నాను. మా పార్టీలో చీలికలు, ముఠాలు లేవని చెప్పడానికి గర్వించుతున్నాను.

వినయపూర్వకాభివందనాలతో
పి. సి. జోషి

VIII
గాంధీజీ జోషీకి వ్రాసిన లేఖ

"బిర్లాహౌస్"
మౌంట్ ప్లెజెంటురోడ్డు,
మలబార్ హిల్
బొంబాయి, 15 సెప్టెంబరు 44

ప్రియమైన జోషీ,

మీ ఉత్తరాలకు కృతజ్ఞత. మీరు ఉద్రేకంతో వ్రాసినందుకు నేనేమీ అనుకోను. నేనువ్రాసిన భాషలోనితీవ్రతకు క్షమించమని అడుగుతున్నాను. నేను వ్రాసినదంతా సహృదయతతోనే వ్రాశానన్నది మీరు నమ్మండి. నాకుగల దురభిప్రాయాలను బయలుపరచకపోతే, మీపార్టీకి సన్నిహితంగా రావడం నాకు కష్టమవుతుంది. సస్నేహంగాను, నిర్మొఖమాటంగాను వ్రాసిన నా ధోరణికి మీరు హర్షిస్తారనుకొన్నాను. అయినప్పటికీ మీపార్టీని గురించి, నాయకులనుగురించి ఇంకా తెలిసికొంటూనే ఉంటాను.

మీసలహా అంగీకరిస్తాను. మీ ఉత్తరాలను భూలాభాయి కిచ్చాను. ఈ విషయంలో నాకు సూచనలిచ్చి నడపమని అతనిని అడిగాను.

మిమ్మల్ని ప్రత్యక్షంగా ఉత్తరాలువ్రాసి బాధపెట్టను. మన ఉభయులకు మిత్రులయినవారి (మీరుదహరించినవారు) ద్వారా మిమ్మల్నిగురించి ఎక్కువ తెలిసికొన ప్రయత్నించుతాను. సరోజినీదేవి భూలాభాయిగారి యింటనే వుంది. రాజాజీ నావద్దనేవున్నాడు; భూలాభాయినుండి రాగానే మీ ఉత్తరాన్ని రాజాజీకి చూపించుతాను.

భవదీయుడు
(సం.) యం. కె. గాంధి

IX
జోషి గాంధీగారికి రాసిన లేఖ

బొంబాయి, 28 సెప్టెంబరు 44

ప్రియమైన గాంధీగారికి,

మీరు 15 వ తేదీన వ్రాసినలేఖ చేరినట్లు, ఆఉత్తరం తెచ్చిన వలంటీరుకు ఒక చీటీద్వారా తెలియజేశాను. దానికి జవాబు ఈయకపోవడానికి కారణం, జిన్నాతో కలియుచున్న మీ ఏకాగ్ర చిత్తానికి భంగం కల్గించకుండా ఉండాలనే నా ఉద్దేశం. దురదృష్టవశాత్తు సంభాషణలు విఫలమయ్యాయి. అందుచే కొద్దిమాటలు వ్రాస్తున్నాను.

నా ఉత్తరంలో నేను అనవసరమైన ఆవేశం ప్రకటించినట్లు మీరు భావించితే, నేనందుకు విచారించుతున్నాను. మీరు వ్రాసినదానికి మేం చాలా ఖేదపడ్డాము. అందుచే మేము న్యాయంగా ఎలాంటి ఉద్రేకభావాలకు గురిఅవుతామో, అవే భావాలు మాలో కలిగాయి. ఉన్నదున్నట్లుచెప్పే నిర్మొగమాటియే గాకపోతే అతడు కమ్యూనిస్టుగాదు. మీరు నిర్మొగమోటంగా ఉంటారన్నసంగతి మీరునాకు వేరే చెప్పనక్కరలేదు. దేశానికంతకూ ఆ విషయం తెలియదు. మాకుకూడా అదే అభి

ప్రాయం వుంది. లేకపోతే, మీతో ఉత్తర ప్రత్యుత్తరాలే జరిపివుండేవాణ్ణి కాదు—నేను వ్రాసినదంతా వ్రాసియుండేవాణ్ణి కాదు—

మా పార్టీపై వేసేనిందలను గురించి రాజాజీ, భూలాభాయి, సరోజిని దేవిగారలు మీకు ఏమిసలహా ఇచ్చారో తెలిసికొన కుతూహల పడుతున్నాము. మాకు న్యాయం కలుగచేయాలన్నా, దేశక్షేమాన్ని మనసులో ఉంచుకున్నా, మీరీ విషయాన్ని యింతటితో వదలివేయక, మీరేదో ఒక నిర్ధారణకు రావాలి. మీరీసారి నాకు వ్రాసేలేఖలో, నిందలువేసే వారికి తగినబుద్ధిచెపుతారని, - ఆహారసమస్య - ముస్లిములు - అంతర్జాతీయ పరిస్థితులు - మొదలగు సమస్యలపై నన్ను ఉత్తరాలువ్రాయమని కోరుతారనీ ఆశించుతాను.

మీరు దేశాన్ని గమ్యస్థానానికి సరియైనమార్గాన నడుపుతారనీ, నిర్మాణాత్మక సమస్యలలో మీతో విభేదం కలుగకుండా ఉండాలని, మేం ఎంతో గాఢంగా వాంఛిస్తున్నాం.

మాకు నిజంగా తలిదండ్రులు లాంటివారైన మహనీయుల మహదాశీస్సులను పొందడానికే మాతీవ్ర ప్రయత్నంకూడ.

గౌరవపూర్వక అభివందనాలతో

(సం) పి. సి. జోషి.

X

మహాత్మా గాంధీకి పి. సి జోషి రాసిన జాబు.

బొంబాయి, 1 ఫిబ్రవరి 45

ప్రియమైన గాంధీజీ,

నా వెనుకజాబును 1944 సెప్టెంబరు 28 వ తేదీన రాశాను. మా నీతినియమాలను గురించి, మీవద్ద పోగయిన ఇతర కమ్యూనిస్టు వ్యతిరేక అంశాలనుగురించి మీ సహచరుల సలహాను తీసుకుంటానని మీరంతకు ముందు రాసినజాబులో వాగ్దానముచేశారు. వారీ విషయాలను పరిశీలించి తమ అభిప్రాయాలు మీకు తెలిపేఉంటారని నే నాశిస్తున్నాను. కాని, ఈ విషయమై మీరు నాకింతవరకు ఏమీ తెలుపలేదు.

ఇటీవల జరిగిన కాంగ్రెసువాదుల సమావేశాల్లో మమ్మల్ని ఆడిపోయడానికి మీపేరునుకూడా ఉపయోగిస్తున్నారనే సంగతి బహుశా మీకు తెలియదనుకుంటాను. మీభావాలను పూర్తిగా గ్రహించామని చెప్పుకుంటూ కొంతమంది వ్యక్తులుకూడా ఈపనే చేస్తున్నారు.

మీరన్నట్లుగా వీరు ప్రచారం చేస్తున్న వాటిలో అత్యధిక భాగం మీ రెన్నటికి అనియుండజాలరని నే నెరుగుదును.

కాని, ఇప్పట్లోనేను బహిరంగంగా ఏమీ చెప్పలేని స్థితిలోఉన్నాను. మా దేశభక్తినీ మా నీతి నియమాలనే సంశయిస్తూ మీరుకొన్ని ప్రశ్నలు వేశారు. అవిచాలా ముఖ్యమైన ప్రశ్నలు. వాటిపై మీకూ నాకూ జరుగుతూన్న ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు ముగిసేవరకూ నేను బహిరంగంగా ఏమీచెప్పలేను. మాది భారతజాతి కడుపున చెడబుట్టిన సంతతికాదనే నిర్ణయానికి మీ సహచరులైన వర్కింగ్ కమిటీసభ్యుల సహాయంతో మీరీసరికి వచ్చిఉంటారని ఆశిస్తున్నాను.

ప్రపంచములో మహత్తరసంఘటనలు జరుగుతున్నాయి. కాని మన దేశం ఛిన్నాభిన్నమైపోతూంది. ప్రధాన రాజకీయసమస్యలపై మీకు రాయాలని మేమెంతో తహతహ లాడుతున్నాం. కాని, నేను లోగడ రాసినట్లు నైతికంగాను, మానసికంగాను మేము విశ్వాసనీయులమని మీలో నమ్మకం కలిగితేనేతప్ప దీనివల్ల ప్రయోజనం ఉండదు; మీకాలం నా కాలం వృధా అవుతుంది.

ఈ ఉత్తర ప్రత్యుత్తరాల్లో మీకేదో అపచారం జరిగినట్లు మీరు భావిస్తున్నారని మహమద్‌గారితో సంభాషణవల్ల గ్రహించాను. కాని, నిజంగా జరిగింది తద్వ్యతిరేకమని మేం భావిస్తున్నాము. మీ కెలాంటి అపచారమూ నేను తలపెట్టలేదు. నా పార్టీని నీలాపనిందలకు గురిచేస్తున్నందుకు నా ఆగ్రహాన్ని వెల్లడించాను. సరాసరివెళ్ళి ప్రజాన్యాయస్థానం ఎదుట నిలబడడానికి సంసిద్ధతను తెలిపాను. అంతకన్నా నేను చేయగలదేమిటో తెలియదు. ఈ విషయాన్ని త్వరలో తేల్చుతామని శ్రీ భూలాభాయ్ దేశాయ్, శ్రీమతి సరోజనీ దేవిగార్లు వాగ్దానం చేశారు. కాని, ఇంతవరకూ వారి దగ్గర్నుంచి ఏలాంటివార్తా రాలేదు. తాను చెప్పదలచిందంతా మీతో ఇదివరకే చెప్పినట్లు రాజాజీ నాతో అన్నారు.

సాధ్యమయినంత త్వరగా జవాబు రాయవలసిందని మిమ్మల్ని కోరుతున్నాను. తాను చెప్పదలచింది త్వరలో చెప్పవలసిందిగా మీ సహచరులను తొందరపెట్టవలసిందని కూడా కోరుతున్నాను.

మీ జవాబును తీసుకురావడానికి మోహన్‌ని పంపగలను. ఇంకా యేమయినా ప్రశ్నలుంటే, అవి తాను సమాధానా లివ్వగలవే అయితే, వాటికి తానే సమాధానమిస్తాడు. ఈవేళ బెంగాలుకు బయలుదేరుతున్నాను. అక్కడ మూడువారాలపాటు ఉంటాను. నేను తిరిగి వచ్చేసరికి మీ ప్రత్యుత్తరం అందగలదా? నేను లేనప్పుడు మోహన్‌కి చాల పనిఒత్తిడి ఉంటుంది. ఫిబ్రవరిమాసంలో మీ దగ్గరకురావడం అతనికి చాల కష్టమవుతుంది. మీరు ప్రత్యేకంగా రమ్మంటే అతను తప్పకుండా వస్తాడు. కాని, మార్చి 7 వతేదీ తరువాత ఏతేదీ అయినా అతనికి సౌకర్యంగా ఉంటుంది.

వినయపూర్వకమైన జోహారులు. మీ విశ్వాసపాత్రుడు,

పి. సి. జోషి

XI

పి. సి. జోషికి మహాత్మాగాంధీ రాసిన జాబు

సేవాగ్రామ్, 5 ఫిబ్రవరి 1945

సోదరా! జోషి,

మీ జాబు చేరింది. జాతీయభాషలో జవాబు రాయవచ్చునా? *

మీరు రాయవద్దన్నారు కాబట్టే నేనింతవరకు జవాబు రాయలేదు. మీరన్నది నిజమే. నేనలా ఫిర్యాదు చేశాను. నేను మీకు సన్నిహితంగా రావాలనుకున్నాను. నా ప్రశ్నలను విస్పష్టటం చేయడానికే అలా రాశాను. అందులో ఆగ్రహానికి అవకాశంలేదు.

భూలాభాయ్ గారికి నేనన్నీ ఇచ్చాను. కాని, ఒక్కవిషయంలో చిక్కువచ్చింది. తనను పక్షపాతిగా భావిస్తున్నారనే కారణంచెప్పి రాజాజీ ఈ విషయంలో సలహాచెప్ప నిరాకరించారు. నా అభిప్రాయాన్ని నేనిదివరకే వెల్లడిచేశాను. మీగు దానిని గమనించే ఉంటారనుకుంటాను. కమ్యూనిస్టులకింకా చేరువకు రావాలనే నా వాంఛ. కాని, మీపై ఆరోపణలు ఇంకా వస్తూనేఉన్నాయి. సోదరుడు హబీబ్‌తో అంతా చెప్పాను. మోహన్ రానవసరంలేదు. కాని, ఆయన రాదలచుకుంటే రావచ్చు.

మీ

యం. కె. గాంధీ

గాంధీగారు హిందీలో రాసిన జాబుకిది అనువాదం.

XII

మహాత్మా గాంధీకి పి. సి. జోషి రాసిన జాబు

బొంబాయి 1 మే 1945

ప్రియమైన గాంధీజీ,

పోయినసారి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగి సుమారు మూడుమాసాలయింది. అసలు మనకు ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభమయి పదకొండు మాసాలు కావస్తూంది. మన ఉత్తర ప్రత్యుత్తరాలను గురించి కొన్ని తప్పుడువార్తలు పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. ఈ విషయం మీకు తెలిసేఉంటుంది. ఈ తప్పుడువార్తలు నా పార్టీకి హానికరంగా ఉన్నాయి. మనకింకా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి కాబట్టి, నేనీ తప్పుడు వార్తల కింతవరకు సమాధానం చెప్పలేదు. కాని, సాధ్యమయినంత త్వరలో మనమొక అంగీకారానికి రావాలని నే నాతృతతో ఉన్నాను. ఇది సహజమే అని మీరు గుర్తిస్తారనుకుంటాను.

కాబట్టి ఈ విషయాన్నిగురించి మీతో చర్చించడానికి మోహన్ని పంపాలని అనుకుంటున్నాను. మే 10 వ తేదీ (లక్ష్మివారం) గాని, మే 17 వ తేదీ (లక్ష్మివారం) గాని మధ్యాహ్నం పూట మోహన్ మహాబలేశ్వర్ రాగలడు. ఈ తేదీల్లో మీకేది సమ్మతమో, ఏవేళప్పుడు అతను మిమ్మల్ని కలుసుకోవచ్చునో, ఈ జాబుతెచ్చిన వారిద్వారా తెలియజేయగలరా?

వినయపూర్వకమైన అభివందనములతో

పి. సి. జోషి

XIII

పి. సి. జోషికి మహాత్మా గాంధీ జాబు

మహాబలేశ్వర్, 3 మే—45

ప్రియమైన జోషీ,

మీరు దయతో పంపినజాబు చూచుకున్నాను.

పత్రికల్లో పడుతూన్న తప్పుడువార్తలకు సమాధానం ఇవ్వడానికి మీరు మన ఉత్తర ప్రత్యుత్తరాలు సమాప్తి పొందేవరకు వేచియుండ నక్కరలేదు.

ఆ విషయం ఎలావున్నా, మోహన్ 24 వ తేదీని రావచ్చు - లక్ష్మీ వారంనాడు మాత్రమే ఆయనకు తీరికఉండే పరిస్థితుల్లో. 10 వ తేదీ వరకు నేను చికిత్సపొందాలి. 17 వ తేదీ ఒక సమావేశం ఉంది. అది మూడు రోజులు జరుగుతుంది.

మీ విశ్వాసపాత్రుడు
యం. కె. గాంధీ

XIV

[మహాత్మునికీ, పి. సి. జోషీకీ జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను ప్రచురించడానికి జోషీగారితరపున మోహన్ కుమారమంగళం మహాత్ముని అనుమతిని కోరారు. భూలాభాయిగారి కిచ్చిన ప్రశ్నలకు త్వరగా సమాధానంవచ్చేలా చూడాలనికూడా వీరు మహాత్ముడిని కోరారు. అందుకు మహాత్ముడు ఇలా జవాబు చెప్పారు.]

మహాత్మా గాంధీ జవాబు

మహాబళేశ్వర్ 24 మే—45

"ఎప్పుడైనా మిమ్మల్ని కలుసుకోడం నాకు సంతోషమే. అందువల్లనే జోషీగారడిగినప్పుడు 'సరే' అన్నాను. కాని, మీరడిగిన రెండు ప్రశ్నలకు రెండుపంక్తులలో జవాబు చెప్పవచ్చు. జోషీగారితో నా ఉత్తర ప్రత్యుత్తరాలు ఎన్నటికీ రహస్యంకాదు. ఏ పరిస్థితుల్లోనయినా వాటిని వెంటనే ప్రచురించుకోవచ్చు. ఒక జాబులో నేవీ సంగతినే తెలియజేశాననుకుంటాను. భూలాభాయిని నేను తొందరపెట్టలేను. ఆయనకు పంపగలిగిన కాయితాలనన్నిటినీ పంపాను. అతనికి ఇష్టంవచ్చిననాడు తన అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. కాని, ఆయన అభిప్రాయం ఒక తీర్పు కాజాలదనే నా అనుమానం. నేనిచ్చిన కాయితాలపై ఒక ప్రముఖ న్యాయవాదియొక్క అభిప్రాయం మాత్రమే కాగలదు. కాని, ఏవిషయమై నా అభిప్రాయం ఇంకా ఏర్పడలేదు. తొందరపడి ఎలాంటి తీర్పు చెప్పడం

నాకిష్టంలేదు. తమ పార్టీని నిలబెట్టుకోవడం తప్ప కమ్యూనిస్టులకు వేరే ఆదర్శములేదని, తమప్రతికక్షులపై ఏరాయినైనా విసరడానికి వారు వెనుదీయరని, చిత్తశుద్ధిగల కాంగ్రెసు వాదులెందరోవచ్చి నాతో చెపుతున్నారు. వివిధ రాష్ట్రాలనుంచి రాస్తున్నారు. వీరు చెప్పేవాటిపై ఆధారపడి నా అభిప్రాయం నిర్ణయించుకోబోవడంలేదు. మిమ్మల్ని - బాట్లీవాలా, జోషీ, హబీబ్‌లను ఆక్షేపించజాలను. హబీబ్ ఒక నెల రోజులకుపైగా నాతో ఉన్నాడు. హబీబు తనతండ్రి*ని చూడ్డానికివచ్చాడు. హబీబంటే నాకెంతో అభిమానం. ప్రజా న్యాయస్థానం ఎదుట నిల్చోవలసిన అగత్యం మీకు లేదని రాజాజీగారి అభిప్రాయం. నేను వారితో ఏకీభవిస్తున్నాను. ఏ రాజకీయ పార్టీమీద తీర్పుచెప్పాలనే వాంఛ నాకులేదు. పూర్తి వివరాలు లేకపోవడంవల్ల నానిర్ణయం తప్పుకావచ్చు. కాబట్టి నానిర్ణయాన్ని బట్టికాక, తమకు తెలిసినవాటినిబట్టే తమవైఖరిని నిర్ణయించుకోవలసిందని నేను మిత్రులకు సలహా ఇస్తున్నాను."

---

* కాంగ్రెసు వర్కింగు కమిటీసభ్యుడైన డాక్టర్ సయ్యద్ మహమ్మద్‌గారు.

చదవండి!

సోవియట్ దేశం - భూతలస్వర్గం
ప్రజానాయకుడు స్టాలిన్
మన లెనిన్
నేటి సోవియట్ యూనియన్
సోవియట్ రైతు
సోవియట్ స్త్రీలు
గుండెనిబ్బరం
వీరమాత
సోవియట్ విదేశాంగనీతి : భారతదేశం
జాతీయైక్యతకు సోవియట్ చూపే మార్గం
స్టాలిన్ : జాతులసమస్య
స్వాతంత్ర్య సంగ్రామం (స్టాలిన్ ఉపన్యాసాలు)
లెనిన్ : పల్లెటూరు పేదలకు
స్టాలిన్ : నిర్మాణసమస్యలు
కార్మికవర్గం - దేశరక్షణ
రైల్వే సమస్యలు

END OF TITLE